E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 29-03-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక:86 || పేజీలు–6 www.ekaburu.com

## మోదీ-ట్రంప్ ఫోన్‌కాల్.... మధ్యలో మస్క్



03



## బ్లాక్ మెయిలింగ్‌కు భయపడం..

- 2014 నుంచి మైనింగ్ లీజులు, అక్రమాలపై సీబీసీఐడీ విచారణ జరుపుతాం
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోగా నిజాలు నిగ్గుతేల్చి నివేదిక ప్రవేశపెడతాం
- శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
- ఒక్కొక్కరి సంగతి తేలుస్తాం.. మైనింగ్ తప్పిదాల్లో ఎవరినీ ఉపేక్షించం
- గతంలో హరీశ్, కేటీఆర్ రూ. వేల కోట్ల ఇసుక మాఫియా నడిపారు
- ఆదాయ పంపకాల్లో తేడాలతోనే కవితను కేటీఆర్ బయటకు గెంటారు
- ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా గట్టి చర్యలు తీసుకున్నాం
- రాఘవ కన్‌స్ట్రక్షన్‌స్‌కు నోటీసు ఇచ్చి రూ. కోటిన్నరపైనే వసూలు చేశాం

**ఈ-కబురు, హైదరాబాద్:** రాష్ట్రంలో అక్రమ మైనింగ్ విషయంలో విపక్ష బీఆర్ఎస్ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతోందని.. అయినప్పటికీ తమ ప్రభుత్వం ఏమాత్రం భయపడబోదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన 2014 జూన్ 2 నుంచి నేటి వరకు ఇచ్చిన మైనింగ్ లీజులు, అక్రమాలపై పూర్తిస్థాయి సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు శాసనసభ వేదికగా సీఎం ప్రకటించారు. ప్రధానంగా అక్రమ మైనింగ్ ఆరోపణలు వచ్చిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్, హరీశ్ సోదరుడి మైనింగ్ సంస్థ సహా ఆరు సంస్థలపైనా సమగ్ర దర్యాప్తు ఉంటుందన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోగా ఈ విచారణ ముగించి నిజాలను నిగ్గుతేల్చి సభ ముందు నివేదికను ఉంచి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శనివారం అసెంబ్లీలో పద్దులపై చర్చ సందర్భంగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మంత్రి పొంగులేటికి చెందినదని.. ఆ సంస్థ మైనింగ్ అక్రమాలపై సభాసంఘాన్ని వేయడంతోపాటు విచారణ సజావుగా సాగేలా సంబంధిత మంత్రి రాజీనామా చేయాలంటూ సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. సభ వెల్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతోపాటు అక్కడే బైఠాయించి నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ఈ కీలక ప్రకటన చేశారు.

మిగతా 2లో

## అంగన్వాడీ కేంద్రాలకు స్వంత భవనాలు



ఈ కబురు, హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు.

02

## పేదలవి కూల్చి.. పెద్దలవి వదిలి



- ఆర్సీపురం నేషనల్ హైవేపై జీహెఎంసీ అధికారుల కూల్చివేతలు వివాదాస్పదం
- టౌన్ ప్లానింగ్ అధికారులపై తీవ్ర ఆరోపణలు చేసిన చిరు వ్యాపారులు

**ఈ–కబురు, పటాన్‌చెరు :** అమీన్‌పూర్ జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలోని అధికారుల తీరు రోజు రోజుకి వివాదాలకు దారి తీస్తోంది. ఉన్నోళ్లకు సద్దులు కట్టి.. పేదోళ్లపై ప్రతాపం చూపడం వారికి షరా మామూలుగా మారింది. నేషనల్ హైవే విస్తరణలో భాగంగా రోడ్డుపై ఉన్న షాపులను తొలగించే విషయం శనివారం వివాదాస్పదంగా మారింది. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారి షాపులను నిర్ధాక్షిణ్యంగా కూల్చి వేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు బడా వ్యాపారులను మాత్రం టచ్ కూడా చేయలేదు.


మిగతా 2లో

## మూసీ నది ప్రక్షాళన ఖాయం



- భవిష్యత్‌తరాలకు అత్యద్భుతమైన నగరాన్ని అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పం
- 8 ఎకరాల్లో దాదాపు 700 కోట్ల వ్యయంతో దేవాలయం పునర్నిర్మాణం
- హైదరాబాద్ మహానగరం మత సామరస్యానికి వేదిక; సిఎం రేవంత్ రెడ్డి
- మూసీ అభివృద్ధి ప్రాజెక్టును అడ్డుకోవాలని కొందరు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు వేశారు
- శ్రీ మచిలేశ్వర స్వామి, శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ

02



6

## ఆర్‌సీబీ అదరగొట్టింది...

15.4 ఓవర్లలోనే 202 పరుగుల లక్ష్యఛేదన
6 వికెట్ల తేడాతో ఓడిన సన్‌రైజర్స్ హైదరాబాద్
కోహ్లి, పడిక్కల్ మెరుపులు
ఇషాన్ పోరాటం వృథా

బ్యాటింగ్‌లో ఆశించినంత భారీ స్కోరు చేయలేకపోయిన సన్‌రైజర్స్ హైదరాబాద్... బౌలింగ్‌లో ఎలాంటి మ్యాజిక్ కనబర్చలేక పరాజయంతో ఐపీఎల్‌ను ప్రారంభించింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు... చాంపియన్ ఆటతీరుతో సీజన్‌లో బోణీ కొట్టింది. జాకబ్ డఫీ అరంగేట్ర మ్యాచ్‌లోనే అదరగొడితే... షెఫర్డ్ అతడికి సంపూర్ణ సహకారం అందించాడు. వీరిద్దరి బౌలింగ్ మెరుపులకు... ఫిల్ సాల్ట్ ఫీల్డింగ్ విన్యాసాలు తోడవడంతో సన్‌రైజర్స్ సాధారణ స్కోరుకే పరిమితమైంది. 'ఛేజ్ మాస్టర్' విరాట్ కోహ్లి, దేవదత్ పడిక్కల్ దూకుడుతో మరో 26 బంతులు మిగిలుండగానే బెంగళూరు లక్ష్యాన్ని ఛేదించింది.



3

## ఒత్తిడిలో రేవంత్‌రెడ్డి: బండి సంజయ్

ఈ కబురు, కరీంనగర్: నియోజకవర్గాల పునర్విభజన, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్రం సిద్ధమవుతుండటంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



## శాంతి కావాలంటే.. మేం చెప్పినట్లు వినాలి

..గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక

ఈ కబురు : అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ కూడా గల్ఫ్ దేశాల పై విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తమ పొరుగు దేశాలకు హెచ్చరికలు చేశారు

02

## ఐపీఎల్ లో బెట్టింగ్ లు వేస్తే బెండు తీస్తాం

...సిటీ సీపీ హెచ్చరిక



ఈ కబురు, హైదరాబాద్ : ఐపీఎల్ క్రికెట్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో నగరంలో బెట్టింగ్ ముఠాల పట్ల హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. క్రికెట్ క్రీడను జూదంగా మార్చి అమాయకుల జీవితాలతో ఆడుకునే వారిపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు.

మిగతా 2లో

## బెంగాల్ టీఎంసీ ప్రభుత్వంపై అమిత్ షా 'ఛార్జ్‌షీట్'



ఈ కబురు : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. టీఎంసీ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ కేంద్రమంత్రి అమిత్ షా 'ఛార్జ్‌షీట్' విడుదల చేశారు. 15 ఏళ్ల టీఎంసీ దుష్పరిపాలన, బెంగాల్‌ను ఆ పార్టీ అవినీతిమయంగా ఎలా మార్చిందనే విషయాలను ఆ ఛార్జ్ షీట్‌లో పేర్కొన్నారు. గత 15 ఏళ్లుగా బెంగాల్‌లో అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు నడుస్తున్నాయని..

మిగతా 2లో

## అమరావతి అజేయం... అజరామరం



ఎవరూ టచ్ చేయలేరు... ఇంచ్ కూడా కదల్చలేరు

దేశం గర్వించేలా భవిష్యత్ నగరంగా రాజధాని నిర్మాణం

ఈ కబురు, అమరావతి : అమరావతే ఆంధ్రప్రదేశ్ ఆత్మ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అమరావతి అజేయం.. అద్భుతం.. అజరామరం అని, అమరావతితోనే తెలుగు వైభవమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శాశ్వత రాజధానిగా అమరావతికి చట్ట భద్దత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి మద్దతు పలికిన శాసన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియచేశారు. రాజధానిని ఎవరూ టచ్ చేయలేరని, ఇంచ్ కూడా కదిలించలేరని అన్నారు. ఏపీకి ఒక్కటే రాజధాని అని, అది అమరావతి మాత్రమేని పునరుద్ఘాటించారు.

అవే కుట్రలు..కుతంత్రాలు

రాజధానిపై వైసీపీ బుద్ధి ఇంకా మారలేదని,

మిగతా 3లో

## యుద్ధ సవాళ్లను దీటుగా ఎదుర్కొంటున్నాం



పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోంది

సవాళ్లను భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోంది

ఉత్తర్‌ప్రదేశ్‌లోని నొయిడాలో పూర్తయిన అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశ ప్రారంభం

ఇందనం విశయంలో తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను భయాందోళనలకు గురిచేయవద్దు; ప్రధాని మోదీ

మిగతా 2లో



## ప్రధాని పదవి పోతుందన్నారు..

...మోదీ చెప్పిన 'నోయిడా నమ్మకం' ఏంటీ?

02

## రాఘువ కన్‌స్ట్రక్షన్స్ పొంగులేటిదే.. రేవంత్‌రెడ్డివి పచ్చి అబద్ధాలు : హరీశ్‌రావు



03

# మూసీ నది ప్రక్షాళన ఖాయం



ఈ కబురు, హైదరాబాద్ :
ఎవరెన్ని విమర్శలు, అడ్డంకులు సృష్టించినా మూసీ నది ప్రక్షాళన పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మానవ తప్పిదాల వల్ల గొప్ప చరిత్ర కలిగిన హైదరాబాద్ కనుమరుగయ్యే ప్రమాదం నుంచి కాపాడి భవిష్యత్తరాలకు అత్యద్భుతమైన నగరాన్ని అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో భాగంగా మూసీ తీరం గండిపేట మంచిరేవులలోని చారిత్రక వీర భద్రస్వామి ప్రాంగణంలో శ్రీ మచిలేశ్వర స్వామి, శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గోవు పూజ నిర్వహించి గోశాలను ప్రారంభించారు. శ్రీ మచిలేశ్వర స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. 1400 ఏండ్ల చరిత్ర కలిగిన ఈ పురాతన ఆలయాన్ని 8 ఎకరాల్లో దాదాపు 700 కోట్ల వ్యయంతో పునర్నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "మూసీ ప్రక్షాళన చేయడమన్నది ఇప్పుడు నిత్యావసర వస్తువులకన్నా అత్యవసరం. పరీవాహక ప్రాంతాన్ని మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా, ప్రత్యేకమైన ధ్యానమందిరాలతో ఒక అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయబోతున్నాం. అక్కడి సూర్యుడు ఇక్కడ పొడిచినా ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ఇది మా దీక్ష. మూసీ నది ప్రక్షాళనతో పాటు దక్షిణ కాశీగా రాణించే విధంగా ఈ పుణ్యక్షేత్రాన్ని పునర్నిర్మిస్తాం. రామప్ప ఆలయ నమూనాను ఇక్కడ నిర్మించాలని సంకల్పించాం. ఇది యథాలాపంగా చేస్తున్నది కాదు. దైవేచ్ఛతో సాగుతున్న కార్యక్రమంగా భావిస్తున్నాం. అందరూ ఆశీర్వదించాలి. సహకరించాలి. చరిత్రను గమనించినప్పుడు నదీ పరీవాహన ప్రాంతాలు, సముద్ర తీరాల్లోని ప్రాంతాలు అభివృద్ధిని సాధించాయి. తెలంగాణ సముద్రతీరం లేని రాష్ట్రం. రాష్ట్రంలో కృష్ణా, గోదావరి, ఈసా నదులున్నా ఆ జలాలను సరిగా వినియోగించుకోకపోవడం వల్ల కొన్ని తరాలు నష్టపోయాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరం కాలుష్యంతో జనజీవనం స్తంభించిపోయింది. రాష్ట్రపతి, ప్రధానమంత్రులు ఉండే ఢిల్లీలో యమునా నది కాలుష్యమై పారుతోంది. కాలుష్యం కారణంగా సెలవులు ప్రకటించడం, పెట్టుబడులు తరలిపోవడం వంటి పరిస్థితుల నుంచి మనం నేర్చుకోవలసిన అవసరం ఉందా లేదా. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి ఒక వేదిక. మూసీ ప్రక్షాళనలో భాగంగా అత్యధిక ప్రాధాన్యత కలిగిన చార్మినార్ మక్కా మసీదు ప్రాంతంలో అద్భుతమైన మసీదును, గౌలిగూడ ప్రాంతంలో సిక్కు చరిత్ర ఉంది. స్వర్ణ దేవాలయంలాంటి దేవాలయం నిర్మాణం, ఉప్పల్ నాగోల్ ప్రాంతంలో అద్భుతమైన చర్చి నిర్మించబోతున్నాం. వర్షాకాలంలోనే కాకుండా నిరంతర నీటి ప్రవాహం, నగర ప్రజల తాగునీరు, పరిశ్రమల అవసరాలను తీర్చడానికి గోదావరి నుంచి 20 టీఎంసీలను తరలిస్తున్నాం. మూసీ పరీవాహక ప్రాంత ప్రజాప్రతినిధులందరూ నదిని ప్రక్షాళన చేయాల్సిందేనని కోరుతున్నారు. ఖర్చుతో కూడుకున్నది అయినప్పటికీ మంత్రివర్గ సహచరుల సహకారంతో ముందుకు వెళుతున్నాం. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని కొందరు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు వేశారు. ప్రాంత ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నం చేయొద్దు. కేసును ఉపసంహరించుకోవాలి.." అని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి , ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్ , కాలె యాదయ్య , కుంభం అనిల్ కుమార్ రెడ్డి , ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా , డీజీపీ శివధర్ రెడ్డి , MRDCL ఎండీ ఈవీ నర్సింహారెడ్డి తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలకు స్వంత భవనాలు

అద్దె భవనాల్లో కాకుండా వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవాల్లో కొనసాగేలా కార్యాచరణను సిద్ధం చేయాలన్నారు. శాసనసభ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీ చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం "తొలి ముద్ద"ను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంగా అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "పిల్లలకు పౌష్టికాహారం అందించాలి. వారి ఆరోగ్యంపై ప్రధానంగా దృష్టి పెట్టాలన్న ఆలోచనతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని చేపట్టాం. తల్లి గర్భంతో ఉన్నప్పుడు తల్లితో పాటు కడుపులోని శిశువు, అలాగే పుట్టిన తర్వాత పిల్లలకు ఎలాంటి పోషకాహారం అందించాలన్న అంశాలపై సమగ్రంగా చర్చించిన తర్వాత ఈ కార్యాచరణ చేపట్టాం.

అయితే, ప్రభుత్వం ఎంత మంచి కార్యక్రమం తీసుకొచ్చినా, క్షేత్రస్థాయి సిబ్బంది సరిగా అమలు చేసినప్పుడే దీనికి గుర్తింపు గౌరవం లభిస్తాయి. ఆ గురుతర బాధ్యత మీదే. ఆకలిని మీరు అమ్మగా అర్థం చేసుకుంటారని, సమస్యల పట్ల మీకు అవగాహన ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మొదటి 6 సంవత్సరాలు పిల్లల ఎదుగుదల, ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. అత్యంత కీలక దశ. ఈ సమయంలో ఆరోగ్యవంతమైన ఆహారం అందించకపోతే ఆశించిన ఎదుగుదల ఉండదు. అందుకని అత్యంత పకడ్బంధీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. అత్యంత విలువైన బాల్య దశ మీ చేతుల్లో ఉంది. దేశంలో జనాభా పోషకాహారం లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. జబ్బులు వచ్చిన తర్వాత చికిత్స కోసం వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. చికిత్స కన్నా జబ్బు రాకుండా చర్యలు తీసుకోవాలి. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోంది. ఏమాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తాం" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ధనసరి అనసూయ సీతక్క గారు, కొండా సురేఖ గారు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి గారితో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, పలు అంగన్‌వాడీ టీచర్లు, పలువురు పిల్లలు పాల్గొన్నారు.

# బెంగాల్ టీఎంసీ ప్రభుత్వంపై అమిత్ షా 'ఛార్జ్‌షీట్'

శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. టీఎంసీ ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల సిలిగుడి కారిడార్ భద్రతకు ముప్పు వాటిల్లిందని ఆరోపించారు. గతంలో అస్సాంలోనూ చొరబాటుదారులు ప్రవేశించేవారని.. భాజపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్కడ చొరబాట్లు ఆగిపోయాయని అమిత్ షా అన్నారు. ప్రస్తుతం కేవలం బెంగాల్ నుంచే భారత్‌లోకి చొరబాటుదారులు ప్రవేశిస్తున్నారని ఆరోపించారు. దేశ భద్రతకు ఇది ఆందోళనకరంగా మారిందన్నారు. కోర్టు ఆదేశాల తర్వాత కూడా బార్డర్ ఫెన్సింగ్ కోసం బీఎస్ఎఫ్‌కు టీఎంసీ ప్రభుత్వం భూమిని కేటాయించట్లేదని ఆరోపించారు. రాష్ట్ర పోలీసులు, అధికారులు అక్రమ వలసలను అడ్డుకోకపోవడం వల్ల వారు నకిలీ పత్రాలతో బెంగాల్ ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోకి వస్తున్నారన్నారు. వారిని అడ్డుకోవడానికి బదులుగా చొరబాటుదారుల ఓట్లు పోతాయనే భయంతో మమత 'సర్' ప్రక్రియపై, ఎన్నికల కమిషన్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బెంగాల్‌లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చొరబాట్లను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకుంటామని..సరిహద్దు కంచె వేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

# శాంతి కావాలంటే..మేం చెప్పినట్లు వినాలి

గల్ఫ్ దేశాల్లో దాడులు ఆగాలన్నా.. శాంతి, అభివృద్ధి నెలకొనాలన్నా తాము చెప్పినట్లు వినాలన్నారు. ఆయా దేశాల గగనతలాలను వినియోగించుకొని శత్రువులు తమపై దాడి చేస్తున్నారన్నారు. తమ గగనతలాలను వినియోగించుకోవడానికి అమెరికా, ఇజ్రాయెల్‌లకు అనుమతి ఇవ్వొద్దని బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్, ఇతర పశ్చిమాసియా దేశాలకు సూచించారు. తాము ఏ దేశంపైనా ముందస్తు దాడులు చేయబోమని అనేక సార్లు స్పష్టం చేసినట్లు పెజెష్కియాన్ పేర్కొన్నారు. కానీ తమ మౌలిక సదుపాయాలు, అణు, ఆర్థిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటే మాత్రం చూస్తూ ఊరుకోబోమని.. ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. శత్రు స్థావరాలు భూస్థాపితం అయ్యే వరకు దాడులు కొనసాగిస్తామన్నారు. శత్రువులకు సహకరించిన వారిని కూడా వదలబోమన్నారు.

--హర్మూజ్‌ను దాటిన మరో రెండు భారత నౌకలు

భారత్ సహా తమ మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఎల్పీజీని మోసుకొస్తున్న మరో రెండు భారత నౌకలు శనివారం హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 90,000 టన్నులకు పైగా ఎల్‌పీజీ (వంటగ్యాస్)ని తీసుకువస్తున్న బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్ అనే రెండు నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయన్నాయి. మరో ఐదు భారతీయ ట్యాంకర్లు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సమీపంలోని జలాల్లో ఇరాన్ అనుమతి కోసం వేచి ఉన్నట్లు తెలుస్తోంది

# బ్లాక్ మెయిలింగ్‌కు భయపడం..

ఇసుక లేదా లీజు మాఫియాలో గతంలో ఫైన్లు, పెనాల్టీలు వేసి వాటిని తగ్గించి సంబంధిత వ్యక్తులను పార్టీలో చేర్చుకొని మళ్లీ ఆ చార్జీలను తొలగించాలని చేసిన ప్రయత్నాలన్నింటినీ ఈ విచారణ ద్వారా తేల్చి ఒక్కొక్కరి సంగతి తేలుస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ ఆదాయానికి గండిపడినా, ఖనిజ లేదా ఇతర ఆదాయానికి గండిపడేలా ఎలాంటి తప్పిదాలు జరిగినా ఎవరినీ ఉపేక్షించబోమని తేల్చి చెప్పారు.

**నాడు బెదిరించి.. లీజులు రాయించుకొని**

'సిరిసిల్ల నియోజకవర్గం నేరెళ్లలో దళితులను ఇసుక లారీతో ఢీకొట్టించి చంపి సంతోశ్‌రావు తండ్రి రవీందర్‌రావుకు సంబంధించిన నేరెళ్ల ఇసుక మాఫియా అక్రమ ఇసుక రవాణా చేసింది. శిరీష గ్రానైట్స్ జియో గ్రానైట్స్ ఏపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేవి. గతంలో మైనింగ్ శాఖ మంత్రిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే ఆయన్ను బెదిరించి వారి మైనింగ్ లీజును రాయించుకున్నారు. మిడ్‌వెస్ట్ గ్రానైట్‌స్‌కు సంబంధించి ఇప్పుడు రెవెన్యూ మంత్రిని బ్లాక్‌మెయిల్ చేసేందుకు ప్రయత్నిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సోదరుడు మహేశ్‌రావు అక్రమ మైనింగ్ చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులకు చెందిన శ్వేత గ్రానైట్స్ అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణే కాకుండా ఈడీ విచారణ కూడా జరుగుతోంది. బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు చెందిన గాయత్రి గ్రానైట్‌స్‌పై గతంలో ఫైన్లు, పెనాల్టీలు వేసి లొంగదీసుకొని మళ్లీ ఆర్బిట్రేషన్‌లో తగ్గించి గాయత్రి గ్రానైట్స్ రాయించుకొని అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారు'అని సీఎం రేవంత్ ఆరోపించారు. వాటన్నింటిపైనా విచారణ జరిపిస్తామన్నారు.

ఇసుక ఆదాయం పెంచాం..

'మేం అధికారంలోకి వచ్చాక పెంచిన ఆదాయం కళ్ల ముందు ఉంది. రాష్ట్రానికి ఇసుక ద్వారా ఆదాయం 2020-21లో రూ. 721 కోట్ల ఆదాయం వస్తే 2025-26లో రూ. 972 కోట్లు (35 శాతం) పెంచాం. నిర్మాణ రంగం కుంటుపడిందని, రియల్ ఎస్టేట్ దెబ్బదిన్నదని ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ దెబ్బతింటే మేం ఇసుకను బుక్కుతున్నామా? బిర్యానీ వండుకొని తింటున్నామా? ఇసుకలోనే ఏడాదికి రూ. వెయ్యి కోట్ల ఆదాయం పెరిగిందంటే అర్థం ఏమిటి?'అని సీఎం రేవంత్ ప్రశ్నించారు.

బురదజల్లేందుకే బ్లాక్‌మెయిలింగ్..

'బీఆర్ఎస్ నేతల దోపిడిని నిలువరించి ఇసుక, మైనింగ్‌లో ఆదాయం పెంచితే రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వచ్చి గత పదేళ్లలో బీఆర్ఎస్ సాగించిన దోపిడి ప్రజలకు అర్థమవుతుందనే సంబంధిత మంత్రిపై బురదచల్లేందుకు, బ్లాక్‌మెయిల్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏపీ, తెలంగాణలో ఏ రెడ్డికైనా ఏదో ఒక రూపంలో బంధువులు, దూరపు బంధువులు ఉండటం సహజమే. మంత్రి పొంగులేటి, వారి కుటుంబ సభ్యులు, ఎవరో బంధువుల మధ్య ఏవో గొడవలు ఉంటే వాటితో మంత్రికేం సంబంధం? సొంత చెల్లినే ఇంట్లోంచి వెళ్లగొట్టి దోపిడికి పాల్పడిన మీరు.. మంత్రి బంధువులకు ఏవో వ్యాపారాలు ఉన్నాయని పొంగులేటికి ముడిపెట్టి ఆయన్ను బెదిరించి లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇది దిక్కుమాలిన చర్య. ఇలాంటి ప్రయత్నాలు చేయకండి. ఇటువంటి వాటి వల్ల మీకు ఎలాంటి ప్రయోజనం ఉండదు'అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

**రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై గతంలోనే చర్యలు తీసుకున్నాం..**

'రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించి గతంలోనే ప్రభుత్వం నోటీసు ఇచ్చి చర్యలు తీసుకోవడంలో భాగంగా సీనరేజీ చార్జీ కింద రూ. 1.52 కోట్లు, పర్మిట్ ఫీజు కింద రూ. 1.22 కోట్లను ప్రభుత్వం, మైనింగ్‌శాఖ కట్టించుకుంది. ఇదేదో బీఆర్ఎస్ వాళ్లు కనిపెట్టి, ఫిర్యాదు చేస్తే తాము తీసుకున్న చర్య కాదు. మా ప్రభుత్వం తరపున మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆ సంస్థకు నోటీసులిచ్చి చర్యలు తీసుకున్నారు. ఇందులో ప్రతిపక్షం కొత్తగా కనిపెట్టిందేమీ లేదు. 2025 ఆగస్టు 8న ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఫిర్యాదుతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌తో మంత్రికి ప్రత్యక్షంగా సంబంధం ఉంటే నోటీసులిచ్చి ఆదాయం రాబట్టే ప్రయత్నం ఏ ప్రభుత్వమైనా చేస్తుందా? ఇలాంటివి గత ప్రభుత్వంలో జరిగాయా?'అని విపక్ష సభ్యులను సీఎం రేవంత్ ప్రశ్నించారు. కాగా, సీఎం ప్రసంగం అనంతరం ప్యానెల్ స్పీకర్ బాలూ నాయక్ సభను ఆదివారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.

# పేదలవి కూల్చి.. పెద్దలవి వదిలి



టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చిన పేదలు, చిరు వ్యాపారుల దుకాణాలు



టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చిన పేదలు, చిరు వ్యాపారుల దుకాణాలు



కూల్చకుండా వదిలేసిన వైన్ షాప్, షాపింగ్ మాల్స్ ముందున్న నిర్మాణాలు



కూల్చకుండా వదిలేసిన వైన్ షాప్, షాపింగ్ మాల్స్ ముందున్న నిర్మాణాలు

భీరంగూడ ప్రాంతంలో నేషనల్ హైవే విస్తరణ పనులు కొనసాగుతుండగా శనివారం టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని సర్వీస్ రోడ్డుపై ఉన్న పలు నిర్మాణాలను తొలగించారు. కానీ రోడ్డుపైనే ఉన్న వైన్ షాపులు, షాపింగ్ మాల్స్, కొందరి పెద్ద మనుషుల నిర్మాణాలను మాత్రం వదిలేయడంతో వివాదం మొదలైంది. ఈ విషయంలో కొంతమంది వ్యాపారులు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లతో వాగ్వాదానికి కూడా దిగారు. కమీషనర్‌తో మాట్లాడామని వ్యాపారులు చెప్పినా టీపీఓ పవన్ వినిపించుకోకుండా నిర్మాణాలను నేలమట్టం చేశాడని, కూల్చివేతల సమయంలో వ్యాపారస్తులను బెదిరింపులకు గురి చేశాడని ఆరోపించారు. ముందుగా చేసిన 100 ఫీట్ల మార్కింగ్ దాటి, కావాలనే షాపులను కూల్చారని అక్కడున్న చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. 100 ఫీట్ల లోపున్న వైన్ షాపుల నిర్మాణాలు, ముందు ఏర్పాటు చేసిన దుకాణాలను ముట్టు కోలేదని అధికారుల తీరును ప్రశ్నించారు. పేదలకో న్యాయం, పెద్దలకో న్యాయం ఏంటని కమీషనర్‌తో మాట్లాడామని చెప్పినా నాకేం సంబంధం లేదంటూ దౌర్జన్యంగా కూల్చివేతలు చేశారని తీవ్రంగా మండిపడ్డారు. బడా వ్యాపారులతో కుమ్మక్కై పేదలపై ప్రతాపం చూపడం అన్యాయమని, దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి టీపీఓపై చర్యలు తీసుకోవాలని కోరారు.




కూల్చకుండా వదిలేసిన వైన్ షాప్, షాపింగ్ మాల్స్ ముందున్న నిర్మాణాలు



## ఐపీఎల్ లో బెట్టింగ్ లు వేస్తే బెండు తీస్తాం

గతంలో చేపట్టిన #SayNoToBettingApps ప్రచారానికి ప్రజల నుంచి అద్భుతమైన మద్దతు లభించిందని, తద్వారా కేంద్ర ప్రభుత్వం వందలాది బెట్టింగ్ యాప్‌లను నిషేధించడమే కాకుండా కఠినమైన ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును కూడా తీసుకువస్తోందని ఆయన గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఈ వంచన కొత్త రూపం దాల్చిందని, యాప్‌లు పోయినా టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త వెబ్‌సైట్లను సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కేవలం ఆన్‌లైన్ మాత్రమే కాకుండా, నివాస గృహాలు, ఫామ్ హౌస్‌లు, ఇతర రహస్య స్థావరాల్లో గుంపులుగా చేరి ఫోన్ల ద్వారా ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. స్థానిక బుకీలు యువతను అప్పుల ఊబిలోకి నెడుతున్నారని, ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు.తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశ చివరికి కన్నీళ్లే మిగిలిస్తుందని, బెట్టింగ్‌లో గెలిచేది కేవలం నిర్వాహకులు మాత్రమేనని, ఆడేవారు సర్వస్వం కోల్పోతారని హెచ్చరించారు. ఒక్కసారి ఈ వ్యసనానికి బానిసలైతే కుటుంబాలు రోడ్డున పడతాయని, క్రికెట్‌ను ఒక క్రీడగా ఆస్వాదించాలి తప్ప జూదంగా మార్చుకోవద్దని హితవు పలికారు. నగరాన్ని, యువతను ఈ బెట్టింగ్ భూతం నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా మిమ్మల్ని వేధిస్తున్నా వెంటనే డయల్ 100కు గానీ, హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555 కు గానీ సమాచారం అందించాలని కోరారు.


# యుద్ధ సవాళ్లను దీటుగా ఎదుర్కొంటున్నాం



ఈ కబురు : పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎదురవుతోన్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని నొయిడాలో పూర్తయిన అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని మోదీ అన్నారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందన్నారు. ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందన్నారు. ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. దీనినుంచి దేశాన్ని రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఇక, ఇలాంటి సమయంలో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోన్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంపై ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయొద్దని రాజకీయ పార్టీలను కోరారు. తమ ప్రభుత్వ విధానాలు.. దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు. నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ.11,200 కోట్లతో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గోలాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు.

# ప్రధాని పదవి పోతుందన్నారు..

**ఈ కబురు : ఉత్తర్‌ప్రదేశ్‌లో పర్యటించిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జెవర్‌లో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ విపక్ష సమాజ్‌వాదీ పార్టీపై విమర్శలు చేశారు. ఆ పార్టీ నేతలు తమ మూఢనమ్మకాలు, పిరికితనంతో నోయిడాను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నవారు నోయిడాలో పర్యటిస్తే అది వారికి అపశకునంగా మారుతుందనే నమ్మకం ఎంతోకాలంగా ప్రచారంలో ఉంది . దానిని ఉద్దేశించే మోదీ మాట్లాడారు.**



"గతంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో అధికారంలో ఉన్నవారు తమ పదవులను కోల్పోతామనే భయంతో ఈ నగరానికి రావడమే మానేశారు. సమాజ్‌వాదీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఓసారి నోయిడాకు వచ్చేందుకు ప్లాన్ చేసుకున్నాను. అప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ఆందోళనకు గురయ్యారు. ఆయన రాకపోగా.. నన్నుకూడా రావొద్దని చెప్పారు. 'మోదీజీ నోయిడా వెళ్లొద్దు. మీరు ఇటీవలే ప్రధాని అయ్యారు' అని చెప్పుకొచ్చారు. నేను వెంటనే 'ఆ ప్రాంత ప్రజల ఆశీర్వాదం కోసం వెళ్తాను. అది సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశాన్ని ఇస్తుంది' అని నాడు బదులిచ్చాను. ఒకప్పుడు రాజకీయ నేతలు వదిలేసిన ఈ ప్రాంతమే.. ఇప్పుడు ప్రపంచస్థాయి నేతలను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉంది. నేడు దేశానికి గర్వకారణంగా నిలిచింది'' అని మోదీ పేర్కొన్నారు. అసలు ఈ నమ్మకానికి 1988 జూన్‌లో పునాది పడింది. అప్పుడు వీర్ బహదూర్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన నోయిడా వెళ్లి వచ్చిన కొన్ని రోజులకే సీఎం పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఆ తర్వాత మరికొందరు సీఎంలకు అలాంటి పరిస్థితే ఎదురైంది. 1989లో ఎన్‌డీ తివారీ, 1995లో ములాయంసింగ్ యాదవ్, 1997లో మాయావతి, 1999లో కల్యాణ్ సింగ్ కూడా ఆ నగర పర్యటన తర్వాతే సీఎం కుర్చీకి దూరమయ్యారు. ఈ నోయిడాను తప్పించుకోవడానికి నేతలు చిత్రవిచిత్రమైన కారణాలు వెతుక్కునేవారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజ్‌నాథ్ సింగ్ కూడా నోయిడా భయాన్ని విస్మరించలేకపోయారు. నోయిడాదిల్లీని అనుసంధానించే డీఎన్‌డీ ఫ్లైవేను నోయిడా నుంచి కాకుండా దిల్లీ వైపు నుంచి ప్రారంభించడం గమనార్హం. ఇక, 2013లో ఆ నగరంలో జరిగిన ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ సమిట్‌కు నాటి ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ హాజరుకాలేదు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆ సమిట్‌కు చీఫ్‌గెస్ట్ అయినా కూడా యాదవ్ రాకపోవడం గమనార్హం. దాద్రి మూకదాడి బాధిత కుటుంబాన్ని నోయిడా వెళ్లి కలవలేక.. లఖ్‌నవూకే రప్పించుకున్నారాయన. అయితే యోగి ఆదిత్యనాథ్ మాత్రం నోయిడా మూఢనమ్మకాన్ని పట్టించుకోలేదు. ఆయన 2017లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పలుమార్లు ఆ నగరంలో పర్యటించారు. ఆ తర్వాత 2022లో రెండోసారి సీఎంగా గెలిచారు. 2027లో మరో దఫా ఎన్నికలకు వెళ్లనున్నారు.

## రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పొంగులేటిదే.. రేవంత్‌రెడ్డివి పచ్చి అబద్ధాలు: హరీశ్‌రావు



**ఈ కబురు, హైదరాబాద్:**

రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీతో మంత్రి పొంగులేటికి సంబంధం లేదన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు తప్పుబట్టారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భార్య, కొడుకు, తమ్ముడు దూరపు బంధువులు ఎలా అవుతారని ప్రశ్నించారు. రాఘవ పేరు స్వయాన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తండ్రిపేరని, ఆ కంపెనీ ఆయనదేనని లోకమంతా తెలుసని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీని తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్, డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతూ.. అక్రమాలపై ప్రశ్నిస్తే డొంకతిరుగుడు సమాధానాలు చెబుతోందని ఆక్షేపించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# సైబరాబాద్‌లో ప్రయోగాత్మకంగా క్లీన్ స్వీప్ డ్రైవ్



జెండా ఊపి డ్రైవ్ ను ప్రారంభిస్తున్న సీఎంసీ కమిషనర్ సృజన, ఎమ్మెల్యే గాంధీ



క్లీన్ స్వీప్ డ్రైవ్ లో కమిషనర్, అధికారులు

ఈకబురు, శేరిలింగంపల్లి : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రయోగాత్మకంగా క్లీన్ స్వీప్ డ్రైవ్ పేరుతో స్వచ్ఛతా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శనివారం ఉదయం గచ్చిబౌలిలో సిఎంసి కమిషనర్ సృజన, తెలంగాణ పిఏసి చైర్మన్, శేర్లింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికపూడి గాంధీ జండా ఊపి ప్రారంభించారు. మొదటిరోజు పటాన్‌చెరు నుండి బీహెచ్ఈఎల్, గచ్చిబౌలి, ఖాజగూడ, లాంకో హిల్స్ మీదుగా మణికొండ వరకు 22 కిలోమీటర్లు ఈ డ్రైవ్ సాగింది. ఈ క్లీన్ స్వీప్ డ్రైవ్ విజయవంతం కావడంతో శనివారం సాయంత్రం గచ్చిబౌలిలోని శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడేతో కలిసి సిఎంసి కమిషనర్ సృజన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ సుజన మాట్లాడుతూ సైబరాబాద్ క్లీన్ స్వీప్ డ్రైవ్ కార్యక్రమంలో ఐటీ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వామ్యం చేసి సైబరాబాద్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్‌ను క్లీన్‌గా ఉంచేందుకు సైబరాబాద్ క్లీన్ స్వీప్ డ్రైవ్ పేరిట ప్రయోగాత్మకంగా ప్రారంభించామన్నారు. ఈ డ్రైవ్‌ను ప్రతి శనివారం లేదా అదివారం నిర్వహిస్తామన్నారు. పటాన్‌చెరులో ప్రారంభించిన ఈ డ్రైవ్ మణికొండ వరకు 22కిలోమీటర్లు కొనసాగిందని, 44 పార్టులుగా 500 మీటర్ల చొప్పున విభజించామన్నారు.

ఈ డ్రైవ్‌లో 128 అధికారులు, 750 మంది సిబ్బంది పాల్గొన్నారు. 22 కిలోమీటర్ల దూరంలో రోడ్ల వెంట ఉన్న చెత్త, పేరుకుపోయిన ఇసుక, సీ అండ్ డి వేస్ట్, చెట్ల కొమ్మలు, ఫుట్‌పాత్ల అక్రమణలు, విద్యుత్ దీపాలు, తెగిపోయిన కేబుల్ వైర్లు తొలగించడంతో పాటు సరిచేయడం జరిగిందన్నారు. నిర్మాణ వ్యర్థాలను డంప్ చేయడం తప్పయితే, ఆ వ్యర్థాలను తొలగించని అధికారులది తప్పేనని తెలిపారు. తాము చేపట్టిన ఈ క్లీన్ స్వీప్ డ్రైవ్‌లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలన్నారు. రోడ్లపై ఇష్టానుసారంగా చెత్త వేసిన వ్యక్తులకు వ్యాపార సముదాయాలకు రూ. 11 లక్షల పెనాల్టీలు విధించామన్నారు. త్వరలోనే చెత్తను తరలించే ఆటోలను ఈవీగా మార్చునున్నట్లు తెలిపారు. వచ్చే వర్షకాలం నాటికి సైబరాబాద్‌లో 15 లక్షల మొక్కలను నాటుతామని అన్నారు. వర్షకాలం వచ్చేలోపు నాలాలో పూడికతీతను పూర్తి చేస్తామన్నారు. సైబరాబాద్‌లో మొత్తం 312 చెరువులు ఉంటే అందులో 261 చెరువుల్లో గుర్రపుడెక్క ఉందన్నారు. గుర్రపుడెక్క తొలగించేందుకు టెండర్లు పిలిచామని, వర్షకాలం ప్రారంభమయ్యే లోపు చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగిస్తామన్నారు. ఈ సమావేశంలో పలు విభాగాల సిఎంసి అధికారులు పాల్గొన్నారు.

# అమరావతి అజేయం... అజరామరం



రాజధానిపై వైసీపీ బుద్ధి ఇంకా మారలేదని, గతంలో చేసిన కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతూనే ఉందని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. దీనిపై సీఎం మాట్లాడుతూ...'రాజ్యాంగంలో రాజధాని అనే పేరే లేదంటారు. వీళ్లకు ఏమైనా ప్రత్యేకమైన రాజ్యాంగం ఉందా? రాజారెడ్డి రాజ్యాంగాన్ని వీళ్లు అనుసరిస్తారు. దేశం అనుసరించేది అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే. విభజన అనంతరం రాష్ట్రానికి రాజధాని విజయవాడగుంటూరు మధ్య ఏర్పాటు చేయాలని 46 శాతం మంది కోరుకున్నట్టు శివరామకృష్ణన్ కమిటీ స్పష్టంగా చెప్పింది. అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తూ వివిధ జాతీయ స్థాయి సంస్థలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేశాం. ప్రతిపక్షంలో ఉన్న వ్యక్తి బేషరతుగా రాజధానిగా అమరావతికి మద్దతు ఇస్తున్నామని గతంలో చెప్పాడు. కానీ ఇప్పుడు రోజుకో మాటతో ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నాడు. టెక్నాలజీ అందుబాటులో ఉన్న రోజుల్లోనూ రాజకీయ విన్యాసాలు చేస్తున్నాడు. వంద ఎకరాలు తీసుకుని భవనాలు కట్టేసి రాజధాని అని చెప్పేయవచ్చు. కానీ రాష్ట్రానికి ఆర్థిక వనరులు సమకూరేలా ఓ ప్రాంతం ఉండాలని ఆలోచించాను. ఈ ప్రాంతాంలోని రైతులను సంప్రదించడంతో 58 రోజుల్లోనే 34 వేల ఎకరాలను రైతులు త్యాగం చేశారు. రాష్ట్రం కోసం రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా. రాజధాని పట్ల కుట్రలు చేసిన కొందరు వ్యక్తులు తోటలకు నిప్పు పెట్టారు. రుణాలను అడ్డుకునేందుకు ప్రపంచ బ్యాంకుకు ఈ మెయిళ్లు పంపించారు. కానీ పవిత్రమైన మట్టి, నీరుతో ఈ ప్రాంతాన్ని పునీతం చేశాం. అందుకే ఇది శాశ్వతంగా నిలుస్తుంది. అమరావతి నిర్మాణ బాధ్యతను పార్లమెంటు తీసుకుంటుందని ప్రధాని కూడా భరోసా ఇచ్చారు. రైతులు ఇచ్చింది కేవలం భూములు మాత్రమే కాదు రాష్ట్రానికి భవిష్యత్తు ఇచ్చారు. సెల్ఫ్ సస్టైయినబుల్ ప్రాజెక్టుగా అమరావతి నిర్మితం అవుతుందని చెప్పాం.. అదే జరిగి తీరుతుంది' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

బ్లూ, గ్రీన్ నగరంగా నిర్మితం

'రాజధాని ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాని వచ్చిన సమయంలో ఓమారు, ఆ తర్వాత మరోమారు, రెండు రోజుల క్రితం అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఇలాంటి ఘటనలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిస్తున్నాను. హైదరాబాద్, అమరావతి రెండు నగరాలు అభివృద్ధికి చిరునామాలుగా మారాలి. భవిష్యత్ నగరంగా అమరావతి బ్లూ, గ్రీన్ సిటీగా నిర్మితం అవుతుంది. దేశం గర్వించేలా అమరావతిని నిర్మించి తీరుతాం. రాజధాని ఒకటే.. కానీ అభివృద్ధి మాత్రం అన్ని ప్రాంతాలకూ విస్తరిస్తాం. మూడు రీజియన్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లు విస్తృతంగా అభివృద్ధి అవుతాయి' అని సీఎం అన్నారు.

రాజధానులు కోల్పోతూ వచ్చాం

'కృష్ణా గోదావరి నదుల మధ్య ప్రాంతాన్ని అమరావతిని రాజధానిగా చేసుకుని శాతవాహన రాజులు పరిపాలించారు. బ్రిటిష్ మ్యూజియంలోనూ అమరావతి గ్యాలరీ ఆనాటి చరిత్రను స్పష్టంగా చెప్తోంది. అంతటి ప్రాచీన, ఘన చరిత్ర మన తెలుగు జాతిది. సంస్కృతీ సంప్రదాయాలతో విలసిల్లిన తెలుగునేల ఇది. బ్రిటిష్ వారు వచ్చాక పరిస్థితులు మారాయి. 200 ఏళ్ల పాటు మద్రాస్ ప్రెసిడెన్సీలో తెలుగు ప్రాభవం కోల్పోయాం. ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చాకే మద్రాసీల నుంచి ఆంధ్రులుగా మనకు వచ్చింది. పొట్టిశ్రీరాములు ప్రాణ త్యాగంతో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏపీ అవతరించింది. మొదట కర్నూలుకు, ఆ తర్వాత హైదరాబాద్‌కు రాజధాని మారింది. ఇప్పుడు అమరావతికి మార్చుకున్నాం. రాజధానులు కోల్పోవటంతో పాటు విమర్శలు, వివక్ష, అవమానాలు భరిస్తూనే వచ్చాం. 1953లో ఆంధ్రరాష్ట్రం, 1956లో ఆంధ్రప్రదేశ్, 2014లో మరోమారు మన రాష్ట్ర అవతరణ తేదీలు మారాయి. మన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం ఏది చేసుకోవాలో తెలీని గందరగోళం నెలకొంది. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం చేసిన రోజును స్మృతీ దినంగా జరుపుకుంటున్నాం' అని సీఎం చంద్రబాబు అన్నారు.

మోస్ట్ లివబుల్ సిటీగా అమరావతి

'1991లో వచ్చిన ఆర్థిక సంస్కరణల్ని అందిపుచ్చుకున్నాం. 2020 విజన్ డాక్యుమెంట్ తయారు చేసుకున్నాం. ఐటీ రివల్యూషన్‌ను ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్‌గా అందిపుచ్చుకున్నాం. అప్పుడు చేసిన విజన్ కారణంగా రూ.1.05 లక్షల కోట్లు రెవెన్యూ హైదరాబాద్ నుంచి వస్తోంది. సైబరాబాద్‌ను ఇటుకా ఇటుకా పేర్చి నిర్మాణం చేశాం. ఫలితాలు వచ్చాయి. అందుకే మోస్ట్ లివబుల్ సిటీగా హైదరాబాద్ నిలిచింది. ఇప్పుడు అమరావతిని కూడా మోస్ట్ లివబుల్ సిటీగా నిర్మాణం చేస్తున్నాం. 2014 విభజన సమయంలో రెండు రాష్ట్రాలకు సమన్యాయం చేయాలని కోరాను. ఇప్పుటి వైసీపీ నాయకుడు నాడు పార్లమెంటులో కెమెరాలు నుంచి తప్పించుకు తిరిగాడు. 10 ఏళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అయినప్పటికీ ఏపీకి సొంత రాజధాని నిర్మాణం చేయాలని ఇక్కడికి వచ్చాం. 9 నెలల్లో ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ, సచివాలయ ప్రాంగణాలను నిర్మించుకున్నాం. సింగపూర్ సహకారంతో ప్రపంచ స్థాయిలో రాజధాని నిర్మాణం కోసం ప్రణాళికలు ఇవ్వాలని కోరాం. ముందు దేశం బాగుండాలి, అలా ఉండాలంటే మన జాతి బాగుండాలి. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలి. తెలుగు వాళ్లకు చెందిన హైదరాబాద్, అమరావతి తొలి రెండు స్థానాల్లో ఉండాలన్నదే నా సంకల్పం' అని సీఎం చంద్రబుబ స్పష్టం చేశారు

ఐదేళ్లు కీచకపర్వం సాగించారు

'రాజధాని వల్ల ఏం జరుగుతుందనే వ్యక్తులు హైదరాబాద్ నుంచి ఏడాదికి 1.05 లక్ష కోట్ల మేర వస్తున్న ఆదాయం చూడాలి. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రాంతంగా అమరావతి ఉంటుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయి. 2019లో ఒక్క ఛాన్స్‌తో అధికారంలోకి వచ్చి ప్రజావేదిక కూల్చి విధ్వంస పాలన మొదలు పెట్టారు. రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కు నెట్టారు. రైతులపై ఉక్కు పాదం మోపారు. కేసులు పెట్టి, బూట్లతో తన్నారు, లాఠీలతో కొట్టారు. అడ్డగోలుగా కేసులు పెట్టి కీచకపర్వం సాగించారు. శాసన మండలిలో సెలెక్ట్ కమిటీతో బిల్లు పాస్ చేయాలని చూశారు. అయినా హైకోర్టు న్యాయస్థానం కాపాడింది. ఈ తరహా పాలన తుగ్లక్ నిర్ణయం అని, పెట్టుబడులు రావని మీడియా పెద్ద ఎత్తున రాసింది. గత పాలనలో నేను, పవన్ కల్యాణ్ సహా అంతా బాధితులమే. కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించాం. మన ప్రభుత్వం ఏర్పడ్డాక అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.15వేల కోట్లు తక్షణ సాయం అందించింది. అమరావతి పనులు రీస్టార్ట్ చేశాం. 2028కి పనులు అన్నీ పూర్తి చేసి అమరావతికి ఒక రూపు తీసుకువస్తాం. 2027 నాటికి ట్రంక్ రోడ్లు, లేఅవుట్స్ సహా వివిధ మౌలిక సదుపాయాలు పూర్తి అవుతాయి. రూ.56 వేల కోట్ల విలువైన 91 పనులు వేగంగా జరుగుతున్నాయి' అని సీఎం వివరించారు.

### ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదం

**అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏపీ శాసనసభ ఏకగ్రీవంగా అమోదించింది. విభజన చట్టం సెక్షన్-5(2)ను సవరించాలని కోరుతూ 'ఎట్ అమరావతి' అనే పదాన్ని చట్టంలో చేర్చేలా అసెంబ్లీ తీర్మానించింది. సీఆర్డీఏ చట్టం ప్రకారం నోటిఫై చేసిన ప్రాంతాలకు కూడా రాజధాని పరిధి వర్తింప చేసేలా చట్ట సవరణ కోరుతూ తీర్మానాన్ని ఆమోదించింది. శాసన సభ ఆమోదం పొందిన ఈ తీర్మానాన్ని స్పీకర్ అయ్యన్న పాత్రుడు రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్‌కు పంపించారు. అలాగే కేంద్ర హోంమంత్రికి ఆమోదం పొందిన తీర్మానం ప్రతిని స్పీకర్ పంపారు. తీర్మానం కాపీలను అటు కేంద్ర హోం కార్యదర్శి, ఏపీ సీఎస్‌కు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పంపించారు.**

# పాకిస్థాన్.. ఉగ్ర సంస్థలకు అడ్డానే! ... అమెరికా నివేదిక



ఈ కబురు : పాకిస్థాన్ ఎన్నో ఏళ్లుగా ఉగ్రవాదానికి కేంద్ర బిందువుగా ఉందని అనేక అంతర్జాతీయ నివేదికలు చెబుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా చట్టసభలకు సంబంధించిన ఓ పరిశోధనా నివేదిక కూడా ఇదే అంశాన్ని మరోసారి స్పష్టం చేసింది. ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ ఇంకా ఆశ్రయం కలిపిస్తోందని, భారత్‌నూ లక్ష్యంగా చేసుకొని కార్యకలాపాలు కొనసాగిస్తూనే ఉందని పేర్కొంది. పాకిస్థాన్‌లో ఉగ్రవాద, ఇతర మిలిటెంట్ గ్రూపులకు సంబంధించి అమెరికా కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ ఇటీవల ఓ నివేదిక విడుదల చేసింది. లష్కరే తయ్యిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్ర సంస్థలు పాక్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని అందులో పేర్కొంది. అంతేకాదు, తీవ్రవాదం వల్ల ఆ దేశం ప్రభావితమైందని పేర్కొంది. 2021లో అఫ్గాన్‌లో తాలిబన్లు అధికారం చేజిక్కించుకున్న తర్వాత ఈ ఉగ్ర సంస్థలు మరింత బలపడ్డాయని, దాడులు గణనీయంగా పెరిగాయని వెల్లడించింది. పాక్‌లో ఉన్న ఉగ్ర సంస్థలను కాంగ్రెషనల్ నివేదిక వివిధ వర్గాలుగా విభజించింది. దేశీయంగా, అంతర్జాతీయంగా, కొన్ని అఫ్గాన్‌కు సంబంధించి, భారత్‌కశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకొని ఆయా సంస్థలు పని చేస్తున్నాయని తెలిపింది. అల్‌ఖైదా తీవ్రంగా బలహీనపడినప్పటికీ.. ఇతర సంస్థలతో కలిసి కార్యకలాపాలు కొనసాగిస్తోందని పేర్కొంది. తెహ్రీక్‌ఇతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) అనేది ఆ దేశంలో అత్యంత ప్రాణాంతక ఉగ్ర సంస్థగా ఉందని తెలిపింది.

# దిల్లీని స్వాధీనం చేసుకుంటా: మమతా బెనర్జీ



ఈ కబురు : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్‌లో శుక్రవారం రామనవమి శోభాయాత్ర జరుగుతున్న సమయంలో ఘర్షణలు చోటుచేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమ బెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే భాజపా దేశంలో అధికారాన్ని కోల్పోవడం ఖాయమని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం దిల్లీని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ముందుకువెళ్తానన్నారు. బెంగాల్‌లోని రాణిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో భాజపా (BJP) అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగించి ప్రజలందరినీ బయటకు గెంటేస్తారని మమత ఆరోపించారు. తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ భాజపా నేతలు అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి ఎన్నికల కమిషన్‌ను భాజపా పావులా వాడుకుంటోందన్నారు. రాష్ట్రంలో భాజపా ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. రాణిగంజ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగిపడుతుండడం వల్ల అక్కడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మమత ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను విడిచిపెట్టి.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లే వారికి తమ ప్రభుత్వం గృహవసతితో పాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని హామీ ఇచ్చారు.

## ఒత్తిడిలో రేవంత్‌రెడ్డి: బండి సంజయ్

డిప్రెషన్‌లోకి వెళ్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. అందుకే ప్రధానమంత్రిపై దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దక్షిణాది, ఉత్తరాది అంటూ ప్రాంతీయ విద్వేషాలు రగిలించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. శనివారం కరీంనగర్‌లో తన నివాసంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్‌ను టీజీ-రెడ్కో అధికారులు, డిస్ట్రిబ్యూటర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. "సీఎం భాషను చూసి తెలంగాణ సమాజం అసహ్యించుకుంటోంది. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి జరిగే నష్టం ఏమిటో సీఎం ఇప్పటికీ చెప్పలేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదు. అన్ని రాష్ట్రాలకు 50 శాతం పెంచుతున్నపుడు దక్షిణాదికి అన్యాయం ఎలా జరుగుతుంది? ఆరు గ్యారంటీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ డ్రామాలాడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ పెట్టుకోవచ్చు. కవిత పార్టీ పెట్టడాన్ని స్వాగతిస్తున్నా. కాళేశ్వరం డిజైన్ లోపానికి ప్రధాన కారకుడు కేసీఆర్. ఇంజినీరు అవతారమెత్తి డిజైన్లు తయారు చేశారు. రేవంత్ ప్రభుత్వం డిజైన్ కారకులను, అవినీతి పరులను అరెస్ట్ చేయడంలేదు. కేసీఆర్‌తో రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారు" అని సంజయ్ ఆక్షేపించారు.

# మోదీ–ట్రంప్ ఫోన్‌కాల్.... మధ్యలో మస్క్ ..స్పందించిన కేంద్రం



ఈ కబురు : పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ఇటీవల ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ జరిగింది. ఈ ఫోన్‌కాల్‌లో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కూడా జాయిన్ అయినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ కథనాలపై భారత ప్రభుత్వం తాజాగా స్పందిస్తూ వాటిని తోసిపుచ్చింది. ''ఈ స్టోరీ మా దృష్టికి వచ్చింది. మార్చి 24న మోదీ, ట్రంప్ మాత్రమే ఫోన్‌లో మాట్లాడుకున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ఇద్దరు నేతలు తమ అభిప్రాయాలు పంచుకోవడానికి అదొక వేదికైంది'' అని విదేశాంగశాఖ స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధం గురించి కొన్నిరోజుల క్రితం మోదీట్రంప్ ప్రధానంగా చర్చించారు. ఇంధన సరఫరాకు కీలకమైన హర్మూజ్ జలసంధి తెరిచి ఉంచాల్సిన ఆవశ్యకత పైనా వారు మాట్లాడుకున్నట్లు భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. ఇలాంటి సున్నితమైన జాతీయ భద్రతా సమస్యలపై ఇద్దరు దేశాధినేతలు చర్చించుకుంటుండగా.. మస్క్ కూడా ఫోన్‌కాల్‌లో జాయిన్ అయినట్లు 'ది న్యూయార్క్ టైమ్స్' తన కథనంలో పేర్కొంది. అయితే ట్రంప్, మోదీ మధ్య జరిగిన సంభాషణ గురించి వైట్ హౌస్, భారత ప్రభుత్వం చేసిన ప్రకటనల్లో మస్క్ ప్రస్తావన ఎక్కడా లేకపోయినా.. ఈ వార్తలు రావడం చర్చనీయాంశమైంది. మరోవైపు, ఫోన్ కాల్‌లో మస్క్ పాల్గొనడంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ మాట దాటేశారు. ఇవన్నీ అనుమానాలకు తావిచ్చాయి. ఈ సందేహాల నేపథ్యంలోనే భారత ప్రభుత్వం దీనిపై స్పష్టతనిచ్చింది.




## ఐఫోన్ వినియోగదారుల కోసం వాట్సప్ డ్యూయల్ అకౌంట్ సదుపాయం

మెటాకు చెందిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్, పలు కొత్త ఫీచర్లను శుక్రవారం ప్రకటించింది. ఇకపై ఐఫోన్ వినియోగదారులు ఒక ఫోన్‌లో, ఒకేసారి రెండు వాట్సప్ ఖాతాలు నిర్వహించుకోవచ్చు. దీంతో పాటు ఫోటో ఎడిటింగ్, మెసేజ్ డ్రాఫ్టింగ్ కోసం కొత్త కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్‌నూ సంస్థ తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగదారులకే 'టూ అకౌంట్స్, వన్ ఫోన్' ఫీచర్ అందుబాటులో ఉండగా.. ఇప్పుడు ఐఓఎస్ ప్లాట్‌ఫాం పైనా అందుబాటులోకి రానుంది. వ్యక్తిగత, వృత్తిపర సంభాషణలను నిర్వహించడానికి వినియోగదారులు రెండు వేర్వేరు ఫోన్లు వినియోగించాల్సిన అవసరం ఇకపై ఉండదని వాట్సప్ తమ బ్లాగ్‌లో పేర్కొంది.

యాప్ కింద భాగంలో కనిపించే ప్రొఫైల్ పిక్చర్ ద్వారా ప్రస్తుతం ఏ ఖాతా యాక్టివ్‌గా ఉందో వినియోగదారులు గుర్తించొచ్చు. జనరేటివ్ ఏఐ ట్రెండ్‌కు అనుగుణంగా, వాట్సప్ నేరుగా చాట్‌లలో 'మెటా ఏఐ'ను అనుసంధానిస్తోంది. వినియోగదారులు ఇకపై మెటా ఏఐ ఉపయోగించి ఫోటోలను టచ్‌అప్ చేయడం, అనవసరమైన అంశాలను తొలగించడం, బ్యాక్‌గ్రౌండ్ మార్చడం లేదా ఫోటో పంపే ముందు వివిధ స్టైల్స్ వాడటం వంటివి చేయొచ్చు. సంభాషణ సందర్భాన్ని బట్టి సమాధానాలను 'ఏఐ రైటింగ్ హెల్ప్' ఫీచర్ సూచిస్తుంది. ఏఐ టూల్స్ వల్ల భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తవని, వినియోగదారుల చాట్‌లు పూర్తి 'ప్రైవేట్'గా ఉంటాయని వాట్సప్ స్పష్టం చేసింది. మెటా ఏఐ కొత్త ఫీచర్లు వినియోగదారులందరికీ వెంటనే అందుబాటులోకి రాకపోవచ్చని కంపెనీ తెలిపింది.

## విద్యుత్ బైక్‌ల సబ్సిడీ పొడిగింపు



విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా తీసుకొచ్చిన పీఎం ఇడ్రైవ్ (PM EDRIVE ) పథకంపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎలక్ట్రిక్ టూ వీలర్ సబ్సిడీలను జులై 31 వరకు పొడిగించినట్లు తెలిపింది. అదేవిధంగా ఇరిక్షా, ఇకార్టుల వాహనాల సబ్సిడీలను 2028 మార్చి 31వరకు పొడిగించినట్లు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించారు. పీఎం ఇడ్రైవ్ పథకాన్ని 2024 అక్టోబర్ 1న ప్రారంభించారు. ఎలక్ట్రిక్ టూ వీలర్లు, త్రీవీలర్లు, ఇ అంబులెన్సులు, ఇట్రక్కులకు కేంద్రం రాయితీ ఇస్తోంది. ఇందులో భాగంగా 1.4 మిలియన్ల ఎలక్ట్రిక్ టూవీలర్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 2.48 మిలియన్ల వాహనాలు విక్రయించినట్లు కేంద్రం తెలిపింది. ఇందుకోసం సబ్సిడీ కింద రూ.1772 కోట్ల నిధులను కేటాయించగా, రూ.1,259.91 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొంది. ఇరిక్షా, ఇకార్టులకు సంబంధించి 36, 462 యూనిట్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 39,034 యూనిట్లు అమ్మకాలు జరిగినట్లు తెలిపింది. ఇప్పటివరకూ ఎలక్ట్రిక్ 2 వీలర్ కేటగిరిలో సుమారు 1 మిలియన్ వాహనాలు విక్రయించినట్లు కేంద్రం అంచనా వేసింది. ఎలక్ట్రిక్ త్రీవీలర్ల విభాగంలో లక్ష్యాన్ని మించి 1,62,981 యూనిట్ల వాహనాలు అమ్మకాలు జరిగినట్లు తెలిపింది. కాగా, ఇరిక్షా, ఇకార్ట్ విభాగంలో ఆశించిన మేర విక్రయాలు జరగనందున, ఆ విభాగాల్లో నిధుల కేటాయింపును రూ. 192 కోట్ల నుంచి రూ.50 కోట్లకు తగ్గించడం గమనార్హం.

## బ్యాంకు కస్టమర్లకు అలర్ట్..
## ఏప్రిల్‌లో సగం సెలవులే!

మార్చి నెల దాదాపు ముగిసింది. ఇక రానున్నది ఏప్రిల్. ఈ నెలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) విడుదల చేసిన బ్యాంక్ హాలిడేస్ జాబితాను ఈ కథనంలో చూసేద్దాం.

ఏప్రిల్ 1: ఆర్థిక సంవత్సర ముగింపు కారణంగా.. దేశంలోని దాదాపు అన్ని బ్యాంకులకు సెలవు.
ఏప్రిల్ 2: మౌండీ థర్స్ డే (Maundy Thursday) సందర్భంగా కొచ్చి, తిరువనంతపురంలోని బ్యాంకులకు సెలవు.
ఏప్రిల్ 3: గుడ్ ఫ్రైడే సందర్భంగా.. అగర్తలా, చండీగఢ్, గౌహతి, జైపూర్, జమ్మూ, శ్రీనగర్ మినహా అన్ని రాష్ట్రాలలోని బ్యాంకులకు సెలవు.
ఏప్రిల్ 5: ఆదివారం (అన్ని బ్యాంకులకు సెలవు)
ఏప్రిల్ 11: రెండవ శనివారం (అన్ని బ్యాంకులకు సెలవు)
ఏప్రిల్ 12: ఆదివారం (అన్ని బ్యాంకులకు సెలవు)
ఏప్రిల్ 14: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి, తమిళ నూతన సంవత్సరం, బైసాఖీ వంటి పండుగల సందర్భంగా ఐజ్వాల్, భోపాల్, చండీగఢ్, ఇటానగర్, కోహిమా, న్యూఢిల్లీ, రాయ్‌పూర్, షిల్లాంగ్, సిమ్లా మినహా అన్ని రాష్ట్రాలలోని బ్యాంకులకు సెలవు.
ఏప్రిల్ 15: బెంగాలీ నూతన సంవత్సర దినం (నబబర్ష)/బోహాగ్ బిహు/విషు/హిమాచల్ దినం కారణంగా అగర్తల, గౌహతి, ఇటానగర్, కొచ్చి, కోల్‌కతా, సిమ్లా, తిరువనంతపురంలలో బ్యాంకులకు సెలవు.
ఏప్రిల్ 16: బోహాగ్ బిహు సందర్భంగా గువహటిలో బ్యాంకులకు సెలవు.
ఏప్రిల్ 19: ఆదివారం (అన్ని బ్యాంకులకు సెలవు)
ఏప్రిల్ 20: బసవ జయంతి / అక్షయ తృతీయ సందర్భంగా బెంగళూరులోని బ్యాంకులకు సెలవు.
ఏప్రిల్ 21: గరియా పూజ సందర్భంగా అగర్తలా బ్యాంకులకు సెలవు.
ఏప్రిల్ 25: నాల్గవ శనివారం (అన్ని బ్యాంకులకు సెలవు)
ఏప్రిల్ 26: ఆదివారం (అన్ని బ్యాంకులకు సెలవు)

అందుబాటులో ఆన్‌లైన్ సేవలు

బ్యాంకులకు వెళ్లి చేసుకోవాల్సిన ఏదైనా అత్యవసరమైన పనిని.. సెలవులను గమనించి ముందుగానే పూర్తి చేసుకోవాలి. బ్యాంకుల ఫిజికల్ బ్రాంచీలు మూసివేసినప్పటికీ నెట్ బ్యాంకింగ్, యూపీఐ, మొబైల్ యాప్స్, ఏటీఎం విత్‌డ్రా వంటి ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు యథావిధిగా కొనసాగుతాయి. వినియోగదారులు చెల్లింపులు చేయడం, బ్యాలెన్స్ చెకింగ్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్‌లు చేసుకోవచ్చు.

# రష్యా నుంచి గ్యాస్!

**అంతర్జాతీయంగా ముడిచమురు ధర పెరుగుతున్న నేపథ్యంలో, రష్యా చమురు విక్రయాలపై అమెరికా ఆంక్షలు సడలించింది. వెంటనే అక్కడి సంస్థల నుంచి ముడిచమురు దిగుమతి చేసుకునేందుకు మన రిఫైనరీలు ఆర్డర్లు పెట్టాయి. ఇప్పుడు ద్రవరూప సహజ వాయువు (ఎల్‌ఎన్‌జీ) కొనుగోళ్లనూ పునరుద్ధరించాలని భావిస్తోంది. హర్మూజ్ జలసంధి అవాంతరాలు ఇపుడిపుడే తొలగిపోయేలా కనిపించకపోవడమే ఇందుకు నేపథ్యం. గ్యాస్ విక్రయానికి కూడా అమెరికా ఆంక్షలు తొలగాల్సి ఉంది. దేశంలో కొరత ఎదురవుతున్నందున, ఎల్‌ఎన్‌జీ కోసం భారత్ ముందుకు వెళ్లాలనుకుంటే.. అమెరికా నుంచి త్వరగానే అనుమతులు రావచ్చని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ వార్తా సంస్థ 'రాయిటర్స్' తెలిపింది.**



ఎల్‌ఎన్‌జీ సరఫరా యథాస్థితి ఎపుడు?

ప్రపంచ ఎల్‌ఎన్‌జీ రవాణాలో 20% హర్మూజ్ జలసంధి ద్వారానే జరుగుతుంది. ఇది ఆగింది. మనదేశానికి గ్యాస్ కీలక సరఫరాదారైన ఖతార్‌లోని అతిపెద్ద ఎల్‌ఎన్‌జీ ప్లాంటు, యుద్ధం వల్ల దెబ్బతింది. ఈ ప్లాంట్లలో కార్యకలాపాలు తిరిగి ప్రారంభించడానికి 35 ఏళ్ల సమయం పడుతుంది. అంటే ప్రస్తుతం ఏడాదికి 12.8 మిలియన్ టన్నుల గ్యాస్ సామర్థ్యం తగ్గినట్లు లెక్క. ఈ రెండు పరిణామాల నేపథ్యంలో.. అంతర్జాతీయంగా గ్యాస్ సరఫరా 35 మి. టన్నుల మేర తగ్గాయని అంచనా. ఇది 500 ఎల్‌ఎన్‌జీ కార్గో షిప్‌లకు సమానం. పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు, అంతర్జాతీయంగా ఎల్‌ఎన్‌జీ సరఫరా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 10% పెరగొచ్చన్న అంచనాలుండేవి. అమెరికా, ఖతార్‌లలో కొత్త ప్లాంట్లు అందుబాటులోకి వస్తాయన్న అంచనాల మధ్య.. ఎల్‌ఎన్‌జీ సామర్థ్యం 460484 మి. టన్నులకు పెరగొచ్చని భావించారు. దీనికి భిన్నమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. తాజా అంచనాల ప్రకారం.. ఖతార్, యూఏఈ నుంచి ఈ ఏడాది 33 మిలియన్ టన్నుల ఎల్‌ఎన్‌జీ ఎగుమతి తగ్గొచ్చన్నది ఎస్ అండ్ పీ గ్లోబల్ అంచనా. 2027 29 మధ్య కూడా సరఫరా ఏటా 19 మి. టన్నుల వరకు తగ్గొచ్చని చెబుతోంది. ఈ లెక్కన ప్రపంచ ఎల్‌ఎన్‌జీ సరఫరా యథాస్థితికి రావడానికి కొన్నేళ్లు పట్టొచ్చు.

### మనకు మేలేనా?

రష్యా నుంచి ఎల్‌ఎన్‌జీ దిగుమతికి అనుమతులు వచ్చినా, ప్రయోజనాలు తక్కువేనని విశ్లేషకులు అంటున్నారు. రష్యాకు చెందిన గాజ్‌ప్రోమ్, భారత్‌కు చెందిన గెయిల్ మధ్య 2012లో కుదిరిన దీర్ఘకాల సరఫరా ఒప్పందంతో పోలిస్తే, తాజాగా కుదుర్చుకునే ఒప్పందం ఆర్థిక పరంగా అంతగా ఉపయోగపడకపోవచ్చని అంటున్నారు. అయితే కొరత నివారణే ఇప్పుడు ముఖ్యం కనుక, కేంద్రం ఏ విధమైన అడుగులు వేస్తుందన్నది ఇపుడు ముఖ్యం. ఇంధన భద్రత కోసం గత వారంలో పలు దేశాలతో భారత్ చర్చలు జరిపింది. రష్యా నుంచి తెచ్చుకునే ఎల్‌ఎన్‌జీ కేవలం వంటకు ఉపయోగించుకునేదే కాబట్టి ఆంక్షలు ఉండకపోవచ్చని సమాచారం. అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధం ప్రారంభమయ్యాక, రష్యా నుంచి భారత్ 5060 మి. బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసిందని అంచనా.

### ఢిల్లీలో సమావేశం

రష్యా డిప్యూటీ ఇంధన మంత్రి పావెల్ సొరోకిన్‌తో భారత పెట్రోలియం, సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పురి ఈనెల 19న భేటీ అయ్యారు. ఈ సమావేశంలోనే ఎల్‌ఎన్‌జీ ఒప్పందంపై చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. రష్యా ఎల్‌ఎన్‌జీ కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉండాలని, దేశీయ ఇంధన దిగుమతిదార్లకు అప్పుడే సలహా ఇచ్చినట్లు సమాచారం. ఆంక్షల మినహాయింపు సాధ్యాసాధ్యాలపై అమెరికాను భారత్ సంప్రదించిందనీ అంటున్నారు.

## గ్యాసోలిన్‌పై రష్యా నిషేధం..
# భారత్‌పై ప్రభావం ఎంత..?

పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొంది. ఇలాంటి సమయంలో రష్యా కీలక ప్రకటన చేసింది. ఏప్రిల్ ఒకటి నుంచి గ్యాసోలిన్ (పెట్రోల్) ఎగుమతులపై నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది. దేశీయ సరఫరాకు ప్రాధాన్యం ఇచ్చేందుకు, ధరలను స్థిరీకరించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో భారత్‌పై ప్రభావం గురించి విశ్లేషణలు వస్తున్నాయి

భారత్ తన ఇంధన అవసరాలు తీర్చుకునేందుకు 80శాతం మేర ముడిచమురు దిగుమతులపైనే ఆధారపడుతోంది. అందులో 20 శాతం రష్యానుంచే వస్తున్నాయి. మన వద్దే భారీస్థాయిలో రిఫైనింగ్ సామర్థ్యం ఉండటంతో.. మన దిగుమతుల్లో గ్యాసోలిన్ లేక ఇతర శుద్ధి చేసిన ఉత్పత్తుల వాటా స్వల్పమే. దేశంలో రిఫైనరీలు రోజుకు 5.6 మిలియన్ల బ్యారెళ్ల మేర చమురును శుద్ధి చేస్తున్నాయి. ఈ రిఫైనింగ్ వల్ల దేశీయ అవసరాలు తీరడమే గాకుండా పలు ఉప ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. కాబట్టి.. గ్యాసోలిన్ ఎగుమతిపై రష్యా (Russia) నిషేధం భారత్‌పై చూపే ప్రభావం పరిమితమే. ఈ నిషేధం సహా ప్రపంచ ఇంధన మార్కెట్లలో అంతరాయాలతో ముడిచమురు ధరలు పెరగొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఇరాన్ యుద్ధం కారణంగా హర్మూజ్‌లో నౌకల రవాణాకు ఆటంకం ఏర్పడటంతో చమురు ధరలు భగ్గుమంటున్నాయి.



యుద్ధానికి ముందు 70 డాలర్లుగా ఉన్న ఒక బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర.. ఇప్పుడు 100 డాలర్లు దాటింది. ఇవన్నీ ఇప్పటికే మన రిఫైనరీలపై ప్రభావం చూపుతున్నాయి.

**ఇదిలా ఉంటే.. మన ప్రభుత్వం కూడా ఎగుమతి సుంకాన్ని విధించిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు, గ్యాస్ దిగుమతులకు అవరోధాలు ఎదురవుతున్నాయి. దేశీయంగా ఇంధన కొరత పెరగకుండా చూసేందుకు, మనదేశం నుంచి పెట్రో ఉత్పత్తుల ఎగుమతులు పెరగకుండా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.**



## మరో కారు లాంచ్ చేసిన బీవైడీ: ధర ఎంతంటే?

**చైనా కార్ల తయారీ సంస్థ బీవైడీ.. అట్టో 1 ఎలక్ట్రిక్ హ్యాచ్‌బ్యాక్‌ను '2026 బ్యాంకాక్ అంతర్జాతీయ మోటార్ షో'లో లాంచ్ చేసింది. దీని ధరలు భారతీయ కరెన్సీ ప్రకారం రూ.12.29 లక్షల నుంచి రూ. 13.15 లక్షలు. బీవైడీ అట్టో 1 ఎలక్ట్రిక్ కారు.. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న సాధారణ అట్టో కంటే భిన్నంగా ఉంది. ఇది క్లోజ్డ్ గ్రిల్, ఎయిర్ వెంట్లు, రెట్రో-స్టైల్ డోర్ హ్యాండిల్స్, 16 ఇంచెస్ అల్లాయ్ వీల్స్, కుడి వైపు ఫ్రంట్ క్వార్టర్ ప్యానెల్‌పై ఛార్జింగ్ ఫ్లాప్, కనెక్టెడ్ టెయిల్ లైట్, షార్క్-ఫిన్ యాంటెన్నా, ఇంటిగ్రేటెడ్ స్పాయిలర్ వంటివి పొందుతుంది. ఇంటీరియర్ విషయానికి వస్తే.. ఇది 7 అంగుళాల ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, వైర్‌లెస్ కనెక్టివిటీతో కూడిన 10.1-అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, అడ్జస్టబుల్ స్టీరింగ్, వైర్‌లెస్ ఛార్జింగ్, నాలుగు డిస్క్ బ్రేకులు, మూడు రాడార్లతో కూడిన రియర్-వ్యూ కెమెరా మొదలైనవి ఉన్నాయి. బీవైడీ అట్టో 1 ఎలక్ట్రిక్ కారు 38.88kWh బ్లేడ్ LFP బ్యాటరీ ప్యాక్‌తో 380 కిమీ రేంజ్ అందిస్తుంది. ఇందులోని ఎలక్ట్రిక్ మోటారు 74 Bhp పవర్, 135 Nm టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. భద్రతా ఫీచర్లలో EBDతో కూడిన ABS, ట్రాక్షన్ కంట్రోల్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, హిల్-స్టార్ట్ అసిస్ట్, ఎలక్ట్రిక్ టెయిల్‌గేట్ ఉన్నాయి.**

## మూసివేత వార్తల వేళ.. టెక్ ప్రియులకు వన్‌ప్లస్ గుడ్‌న్యూస్

చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీ వన్‌ప్లస్ (oneplus) టెక్ ప్రియులకు గుడ్‌న్యూస్ చెప్పింది. దేశంలో తమ సర్వీస్ నెట్‌వర్క్‌లను 50 శాతం విస్తరిస్తున్నామని ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న 400 సర్వీస్ నెట్‌వర్క్‌లను 600కు పెంచుతున్నామని తెలిపింది. గ్లోబల్ మార్కెట్లలో కంపెనీ మూతపడుతోందన్న వదంతుల నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. సొంత బ్రాండ్‌గా మొదలైన వన్‌ప్లస్.. ఇతర కంపెనీల పోటీతో ఏటా తన ప్రాభవాన్ని కోల్పోతోంది. ఈ క్రమంలోనే మాతృ సంస్థ బీబీకే ఎలక్ట్రానిక్స్‌కు చెందిన మరో స్మార్ట్‌ఫోన్ కంపెనీ ఒప్పోకు (Oppo) సబ్‌బ్రాండ్‌గా అవతరించింది. కొన్నేళ్లుగా ఆ కంపెనీకి సబ్‌బ్రాండ్‌గా కొనసాగుతూనే ఫోన్లను లాంచ్ చేస్తోంది. అయితే, మార్కెట్ వాటా క్రమంగా క్షీణిస్తుండటంతో వన్‌ప్లస్‌ను మూసివేస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. తాజాగా వన్‌ప్లస్ సీఈఓ రాబిన్ లియు రాజీనామా చేయడంతో ఈ ప్రచారం మరింత బలపడింది. కాగా, ఈ వదంతులను కంపెనీ తోసిపుచ్చింది. సర్వీస్ నెట్‌వర్క్‌ను పెంచడం ద్వారా భారత్‌లో తమ కార్యకలాపాలు కొనసాగుతాయని స్పష్టం చేసింది.

**వన్‌ప్లస్ తన సొంత సర్వీస్ సెంటర్లను నిర్మించడానికి బదులుగా ప్రస్తుతం ఉన్న ఒప్పో సెంటర్లనే వాడుకోనుంది. తద్వారా వినియోగదారులకు సులువుగా తమ సేవలు అందుతాయని తెలిపింది. పెంచిన డేటా సెంటర్ల సేవలు ఏప్రిల్ నుంచి అందుబాటులోకి వస్తాయని పేర్కొంది. ప్రధానంగా టైర్ -2, టైర్-3 నగరాల్లో వీటిని విస్తరిస్తున్నామని చెప్పింది.**
**అంతేకాకుండా ఏప్రిల్7న వన్‌ప్లస్ నార్డ్ 6ను భారత మార్కెట్లోకి విడుదల చేస్తామని కంపెనీ ధృవీకరించింది.**



## 'జననాయగన్' మరింత ఆలస్యం.. జులైలోనేనా!



విజయ్ నటించిన 'జన నాయగన్' విడుదలపై ఇంకా సందిగ్ధత నెలకొనే ఉంది. తాజా నివేదికల ప్రకారం ఈ సినిమా (Jana Nayagan) విడుదల మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. 2026 ప్రారంభంలోనే దీన్ని విడుదల చేయాలని భావించినప్పటికీ సెన్సార్ బోర్డ్ (CBFC) పరంగా ఎదురైన అడ్డంకుల వల్ల ఇది వాయిదా పడింది. విజయ్ పుట్టినరోజున దీన్ని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. జూన్ 22న ఈ హీరో పుట్టినరోజు కావడంతో జూన్ 18న దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించారు. తాజాగా ఈ తేదీకి కూడా జననాయగన్ రావడం కష్టమే అని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని నిర్మించిన కేవీఎన్ ప్రొడక్షన్స్ చేతిలో ప్రస్తుతం భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిలో యశ్ నటిస్తోన్న 'టాక్సిక్' ఒకటి. ఈ చిత్రం జూన్‌లో విడుదల కానుంది. దీంతో జులైలో 'జననాయగన్'ను రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారట.

సినిమా విడుదల ఆలస్యం అవుతుండటంతో చిత్ర బృందానికి మరో తలనొప్పి వచ్చి పడింది. ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ ఒప్పందం రద్దయ్యే ప్రమాదం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. స్ట్రీమింగ్ పార్ట్‌నర్ ఇప్పటికే ఈ ఒప్పందం నుంచి వెనక్కితగ్గే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే, సినిమా లెక్కలపై ఇది తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో విజయ్‌కు జోడీగా పూజా హెగ్డే నటించారు.



## రూ.10 లక్షల రెమ్యునరేషన్.. రూ.50వేలకు ఓకే చెప్పిన ఇళయరాజా

మలయాళ అగ్రకథానాయకుడు మమ్ముట్టి నటించిన క్లాసిక్ హారర్ చిత్రం 'అధర్వం'. 1989లో విడుదలైంది. డెన్నిస్ జోసెఫ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాకు పాటలు హైలైట్‌గా నిలిచాయి. అయితే ఈ సినిమాకు సంగీతం అందించిన లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా మమ్ముట్టిపై ఉన్న గౌరవంతో తన రెమ్యూనరేషన్‌ను ఊహించని విధంగా తగ్గించుకోవడం అప్పట్లో సంచలనం సృష్టించింది. తాజాగా దానికి గల కారణాన్ని ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దర్శకుడు పంచుకున్నారు. సాధారణంగా ఆ సమయంలో ఇళయరాజా ఒక సినిమాకు దాదాపు రూ.10 లక్షల వరకు ఫీజు తీసుకునేవారు. 'అధర్వం' సినిమా మొత్తం బడ్జెట్ కేవలం రూ.22 లక్షలు మాత్రమే అని తెలుసుకున్న ఆయన చిత్ర నిర్మాతల పరిస్థితిని అర్థం చేసుకున్నారు. డెన్నిస్, మమ్ముట్టిల 'న్యూఢిల్లీ' సినిమా అంటే ఇళయరాజాకు ఉన్న ప్రత్యేక అభిమానం కారణంగా తన ఫీజును కేవలం రూ.50,000కు తగ్గించుకుని ఈ ప్రాజెక్ట్‌కు పనిచేశారు. ''నేను ఇళయరాజాకు ఫోన్ చేసి మాట్లాడాను. అప్పటి వరకూ నేను తీసిన సినిమాలేంటో తెలుసుకున్నారు. 'న్యూఢిల్లీ' అంటే ఇష్టమని చెప్పారు. ఆయన్ని కలవగానే 'ప్రస్తుతం ఒక్కో సినిమాకు ఎంత రెమ్యునరేషన్ తీసుకుంటున్నానో తెలుసా మీకు? మీరు నాకు ఎంత ఇస్తారు' అని ఇళయరాజా నన్ను అడిగారు. నేను అంత ఇవ్వలేనని రూ.50వేలు మాత్రమే ఇవ్వగలనని చెప్పా. నా నిజాయతీకి నచ్చి ఆయన వెంటనే ఓకే అన్నారు. మేము ఆయనకు సిల్క్ స్మిత పాట కోసం ఒక రిఫరెన్స్ ఇచ్చాము. అది విన్న వెంటనే ఆయన 'పుళయోరత్తిల్' అనే ట్యూన్ హమ్ చేశారు. అలానే 30 నిమిషాల్లోనే మిగిలిన మూడు పాటలను కూడా కంపోజ్ చేశారు'' అని దర్శకుడు డెన్నిస్ చెప్పారు.

## పెళ్లిపై నాకు మంచి అభిప్రాయం లేదు: సాయిపల్లవి

టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్‌ను సంపాదించుకున్న సాయిపల్లవి... పెళ్లి గురించి, తన వ్యక్తిగత భావోద్వేగాల గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తనకు పెళ్లిపై పెద్దగా మంచి అభిప్రాయం లేదని ఆమె తెలిపింది. పెళ్లైన వారు కూడా పెళ్లి చేసుకోవద్దని తనకు సలహా ఇస్తున్నారని చెప్పింది. అందుకే తనకు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదని తెలిపింది. ఒంటరిగానే తాను చాలా ప్రశాంతంగా ఉన్నానని, ప్రస్తుతం తన దృష్టంతా సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది.

అయితే, అర్ధరాత్రి పూట ఏమీ తినకుండా ఏడుస్తూ కూర్చునే అలవాటు ఉందని తెలిపింది. ఆ సమయంలో కేవలం తన తల్లి మాత్రమే తనకు తోడుగా ఉంటుందని చెబుతూ ఆమె ఎమోషనల్ అయ్యారు. దీంతో, బయటకు ఎంతో నవ్వుతూ కనిపించే సాయి పల్లవి మనసులో ఇంతటి సున్నితత్వం, ఏదో తెలియని బాధ ఉన్నాయా? అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.



## బరిలో వరుణ్ తేజ్.. ఫస్ట్ వీడియో చూశారా?




వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా బరి నుంచి పోస్టర్ వీడియోను విడుదల చేశారు. దర్శకుడు యదు వంశీ తెరకెక్కిస్తున్న ఈ మూవీని నిహారిక కొణిదెల తన బ్యానర్ 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్'పై నిర్మిస్తున్నారు. నేడు పూజా కార్యక్రమంతో మొదలైన ఈ మూవీ నుంచి తాజాగా 'ది వరల్డ్ ఆఫ్ బరి' (The World Of Bhari) పేరుతో పవర్‌ఫుల్ వీడియోను పంచుకున్నారు. 2027 సంక్రాంతికి పాన్ ఇండియా రేంజ్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు.

## 'పుష్ప' చిత్రాల రికార్డును బద్దలుకొట్టిన 'ధురంధర్'

బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్2' వసూళ్ల పరంపర కొనసాగుతోంది. ఇప్పటివరకూ ఈ మూవీ రూ.1,128 కోట్లు (గ్రాస్) (dhurandhar 2 worldwide collection) వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. 9వ రోజు హిందీ వెర్షన్ రూ.41.55 కోట్లు వసూలు చేయగా, తెలుగులో రూ.2.85 కోట్లు రాబట్టింది. తమిళనాడులో మాత్రం పెద్దగా ప్రభావం చూపించటం లేదు. దేశవ్యాప్తంగా మొత్తం 18,456 షోలు పడ్డాయి. ఈ క్రమంలో ఇప్పటికే వివిధ చిత్రాలు నెలకొల్పిన రికార్డులను ఈ మూవీ బద్దలు కొడుతోంది.

'పుష్ప' సినిమాల రికార్డు అధిగమించి..

'ధురంధర్' ఫ్రాంచైజీ బాక్సాఫీస్‌కు సరికొత్త లెక్కలు నేర్పుతోంది. రెండు సినిమాలు కలిపి 'దంగల్', 'బాహుబలి', 'పుష్ప' చిత్రాల జీవితకాల కలెక్షన్లను దాటేశాయి. అదే 'బాహుబలి2' (రూ.1,810 కోట్లు), 'పుష్ప2'(రూ.1,800 కోట్లు) చిత్రాలతో పోలిస్తే, 'ధురంధర్: ది రివెంజ్' ఇంకా వెనుకబడే ఉంది. అయితే, విడుదలై పది రోజులే కావడంతో ఆ రికార్డులను అధిగమించడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా 'దంగల్' (రూ.2,024కోట్లు) రికార్డు ఇప్పటికీ పదిలంగానే ఉంది.

లెక్కలు వేగంగా మారకపోవడానికి కారణమదేనా?

బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్2' మంచి వసూళ్లు రాబడుతున్నా, గత చిత్రాలతో పోలిస్తే, ఇంకా వెనుకబడి ఉంటానికి కారణాలు చాలానే ఉన్నాయి. 'పార్ట్1' కేవలం హిందీలో మాత్రమే విడుదల చేశారు. ప్రాంతీయ భాషల్లో విడుదల చేయకపోవడం ఆ చిత్రానికి కాస్త మైనస్. అయితే, 'పార్ట్2' విషయంలో ఆ తప్పు చేయకుండా ఆదిత్యధర్ అండ్ టీమ్ ముందు నుంచే జాగ్రత్త పడింది. అయినా కూడా సెన్సార్, సాంకేతిక సమస్యల కారణంగా తెలుగు, తమిళ ప్రీమియర్స్ రెండు రోజుల పాటు ప్రదర్శనకు నోచుకోలేదు. ఇది వసూళ్లపై కాస్త ప్రభావం చూపించిందనే చెప్పాలి. ఇక మరోవైపు బాక్సాఫీస్ వద్ద రూ.1800 కోట్లు సాధించిన చిత్రాలు ఏదో ఒకరకంగా టికెట్ ధరలు పెంచుకుని విడుదలైనవే. 'పుష్ప2' ప్రీమియర్ టికెట్ రూ.1000కు విక్రయించారు. ఆ తర్వాత వారం, పదిరోజుల పాటు అధిక ధరకు టికెట్లు విక్రయించారు. కానీ, 'ధురంధర్2' టికెట్ ధరల పెంపు లేకుండానే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్ ఏవీ కూడా టికెట్ ధరను పెంచలేదు. అయినా కూడా 9 రోజుల్లో రూ.1,100 కోట్లు వసూలు చేసింది.



## వరుణ్ తేజ్ హీరో.. నిహారిక నిర్మాత.. క్లాప్ కొట్టిన పవన్ కల్యాణ్

'బరి' సినిమాతో బరిలోకి దిగనున్నారు వరుణ్‌తేజ్. ఆయన (Varun Tej) హీరోగా యదు వంశీ దర్శకత్వంలో ఈ చిత్రం రానుంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక ఈ సినిమాను (Bari) నిర్మిస్తున్నారు. నేడు ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఏపీ డిప్యూటీ సీఎం, ప్రముఖ నటుడు పవన్‌కల్యాణ్ 'బరి'కి క్లాప్ కొట్టి సినిమాను ప్రారంభించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

వాలీబాల్ కథా నేపథ్యంగా ఎందుకు తీసుకున్నారు?

వంశీ: ఇందులో స్పోర్ట్స్ మాత్రమే కాదు.. ఎమోషన్స్‌కు కూడా ప్రాధాన్యమిచ్చాం.

ఇప్పటివరకూ మీరు నిహారికకు గిఫ్ట్ ఇచ్చి ఉంటారు. ఇప్పుడు తను మీకు రెమ్యునరేషన్ ఇవ్వాలి కదా? తీసుకున్నారా?

వరుణ్‌తేజ్: ఆల్‌రెడీ కొంచెం తీసేసుకున్నా. నిహారిక మంచి సినిమాను నిర్మిస్తోంది. కొత్త వాళ్లకు అవకాశం ఇస్తోంది. టాలెంట్‌కు ప్రాధాన్యమిస్తోంది. ఈ విషయంలో తనని చూసి నేను గర్వపడుతున్నాను.



సంక్రాంతికి రావాలని ఎందుకు అనుకుంటున్నారు?

నిహారిక: కథపై నాకు నమ్మకం ఉంది. అందుకే సంక్రాంతికి విడుదల చేయాలని ప్లాన్ చేశాం.

8 నెలల్లో షూటింగ్ ఎలా పూర్తి చేస్తారు?

వరుణ్‌తేజ్: ప్రీ ప్రొడక్షన్ పనులన్నీ అయిపోయాయి. నేను గత 7 నెలలుగా వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తున్నా.

## 'పెద్ది' కోసం 'లెనిన్' వాయిదా.. విడుదల ఎప్పుడంటే?

అఖిల్ అక్కినేని కథానాయకుడిగా నటించిన 'లెనిన్' (Lenin Movie) చిత్రం వాయిదా పడింది. తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం మే 1న ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. తాజాగా జూన్ 26వ (Lenin Movie Release Date) తేదీకి వాయిదా వేశారు. బుచ్చిబాబు దర్శకత్వంలో స్టార్ హీరో రామ్‌చరణ్ నటిస్తున్న 'పెద్ది' (Peddi) ఏప్రిల్ 30న విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 'లెనిన్'ను వాయిదా వేస్తూ చిత్ర బృందం నిర్ణయం తీసుకుంది. పరస్పర గౌరవంతో పాటు, ఎక్కువ సంఖ్యలో థియేటర్ల లభ్యత, సానుకూల వాతావరణాన్ని కల్పించేందుకు, ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో బలమైన భావోద్వేగాలు, ఆకట్టుకునే కథనంతో 'లెనిన్'ను తీర్చిదిద్దుతున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. తమన్‌సంగీతం అందిస్తున్నారు. మనం ఎంటర్‌ప్రైజెస్ LLP, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు.



## ఆంటోనెల్లికి 'పోల్ పొజిషన్'



సుజుకా (జపాన్): ఫార్ములావన్ (ఎఫ్1) జపాన్ గ్రాండ్ ప్రిలో మెర్సిడెస్ డ్రైవర్ కిమీ ఆంటోనెల్లి 'పోల్ పొజిషన్'సాధించాడు. గత రేసు చైనా గ్రాండ్ ప్రిలో విజేతగా నిలిచిన 19 ఏళ్ల ఈ డ్రైవర్... వాయు వేగంతో దూసుకెళ్లి అందరికంటే ముందు నిలిచాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ రేసులో ఆంటోనెల్లి 1 నిమిషం 28.778 సెకన్లలో ల్యాప్‌ను పూర్తి చేసి అగ్రస్థానం దక్కించుకున్నాడు. 5.8 కిలో మీటర్ల కష్టతరమైన సర్క్యూట్‌ను ఆంటోనెల్లి అవలీలగా పూర్తిచేశాడు. మెర్సిడెస్‌కే చెందిన జార్జ్ రసెల్ (1 నిమిషం 29.076 సెకన్లు) రెండో స్థానంలో నిలిచాడు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు జరిగిన మూడు రేసుల్లోనూ ఈ ఇద్దరే తొలి రెండు స్థానాల్లో నిలవడం విశేషం. గతేడాది మెక్‌లారెన్ డ్రైవర్లు ఆస్కార్ పియాస్ట్రి, నోరిస్ సత్తాచాటగా... ఆ ఈసారి మెర్సిడెస్ డ్రైవర్లు జోరు కనబరుస్తున్నారు. తాజా క్వాలిఫయింగ్ రేసులో పియాస్ట్రి (1 నిమిషం 29.132 సెకన్లు; మెక్‌లారెన్), చార్లెస్ లెక్‌లెర్క్(1 నిమిషం 29.405 సెకన్లు) వరుసగా మూడో, నాలుగో స్థానాల్లో నిలిచారు.
లాండో నోరిస్ (1 నిమిషం 29.409 సెకన్లు) ఐదో స్థానానికి పరిమితం కాగా... ఏడుసార్లు ప్రపంచ చాంపియన్ లూయిస్ హామిల్టన్ (1 నిమిషం 29.567 సెకన్లు) ఆరో స్థానంలో నిలిచాడు. నాలుగుసార్లు ప్రపంచ చాంపియన్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (1 నిమషం 30.262 సెకన్లు) పదకొండో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

## ప్రజ్ఞానందకు సవాల్



పాఫోస్ (సైప్రస్): ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ కోసం దొమ్మరాజు గుకేశ్‌ను ఢీకొట్టేదెవరు? ఇద్దరు భారతీయుల మధ్య ప్రపంచ టైటిల్ పోరు చూస్తామా? పోటీదారును నిర్ణయించే క్యాండిడేట్స్ చెస్ టోర్నీకి వేళైంది. మేటి ఎనిమిది మంది ఆటగాళ్లు పోటీపడే ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ ఆదివారం సైప్రస్‌లో ఆరంభమవనుంది. పురుషుల విభాగంలో భారత్ నుంచి ప్రజ్ఞానంద మాత్రమే బరిలో ఉన్నాడు. ఫాబియానో కరువానా (అమెరికా), హికరు నకమురు (అమెరికా), అనీష్ గిరి (నెదర్లాండ్స్), వీయ్ యీ (చైనా), సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్), ఆండ్రీ ఇసిపెంకో (రష్యా), మతియాస్ బ్లూబమ్ (జర్మనీ)లతో కలిసి ప్రజ్ఞానంద టైటిల్ కోసం పోరాడనున్నాడు. ఈ ఫిబ్రవరిలో టాటా స్టీల్ చెస్ టోర్నీలో విజేతగా నిలిచిన ప్రజ్ఞానంద మంచి ఫామ్‌లోనే ఉన్నాడు. కరువానా, నకమురు, అనీష్‌గిరితో అతడికి గట్టిపోటీ ఎదురుకావొచ్చు. ప్రతి ఆటగాడు మిగిలిన ఆటగాళ్లతో రెండుసార్లు ఆడతాడు. ఎక్కువ పాయింట్లు సాధించిన ప్లేయర్ వచ్చే ఏడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో గుకేశ్‌ను ఢీకొంటాడు. మహిళల విభాగంలో అర్హత సాధించినా.. కోనేరు హంపి భద్రత కారణాలతో టోర్నీకి దూరమైంది. ఆమె స్థానంలో అనా ముజ్‌చుక్ (ఉక్రెయిన్) ఆడుతుంది. భారత్ తరపున ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్, వైశాలి అదృష్టం పరీక్షించుకోనున్నారు. గతేడాది ప్రపంచకప్ విజయంతో తన స్థాయిని పెంచుకున్న దివ్య.. కీలక టోర్నీలో ఎలా రాణిస్తుందో చూడాలి. జు జినెర్ (చైనా), అసుబయెవా (కజకిస్థాన్) కూడా టైటిల్ రేసులో ఉన్నారు. మహిళల విభాగంలో గెలిచే క్రీడాకారిణి.. వచ్చే ఏడాది జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో జు వెన్‌జున్ (చైనా)తో తలపడనుంది. ఓపెన్ విజేతకు 6 కోట్ల 65 లక్షలు, మహిళల ఛాంపియన్‌కు రూ.2 కోట్ల 85 లక్షలు దక్కుతాయి.

## ఫేవరెట్ ముంబయి.. కోల్‌కతాకు సవాలే



ముంబయి: అయిదుసార్లు ఛాంపియన్ ముంబయి ఇండియన్స్ ఐపీఎల్ 19వ సీజన్‌లో కప్పు వేటకు సిద్ధమైంది. తన తొలి మ్యాచ్‌లో ఆ జట్టు ఆదివారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ఢీకొంటుంది. హార్దిక్ పాండ్య నేతృత్వంలోని ముంబయి అన్ని విభాగాల్లోనూ బలంగా ఉంది. రోహిత్, రికెల్టన్, సూర్యకుమార్, తిలక్ వర్మ, హార్దిక్ వంటి వారితో ఆ జట్టు బ్యాటింగ్ దుర్భేద్యంగా కనిపిస్తోంది. ఇక బౌలింగ్‌లో బుమ్రా రూపంలో మ్యాచ్ విన్నర్ ముంబయికి ఉన్నాడు. ఇంకా బౌల్ట్, దీపక్ చాహర్, శాంట్నర్‌లతో ముంబయి బౌలింగ్ మెరుగ్గా ఉంది. కిందటిసారి మూడో స్థానంతో సరిపెట్టుకున్న ఆ జట్టు ఈసారి ఎలాగైనా విజేతగా నిలవాలనే పట్టుదలతో ఉంది. ముంబయిని నిలువరించడం కోల్‌కతాకు సవాలే. రహానె నేతృత్వంలోని నైట్‌రైడర్స్‌కు బౌలింగ్ పెద్ద సమస్య. ముస్తాఫిజుర్‌ను వదిలేయడం.. హర్షిత్ రాణా, ఆకాశ్‌దీప్ గాయాలతో దూరం కావడంతో కోల్‌కతా బౌలింగ్ బలహీనపడింది. పేసర్ పతిరన తొలి రెండు మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిపై ఆ జట్టు చాలా ఆధారపడుతోంది.

# ఆర్‌సీబీ అదరగొట్టేంది...

**బెంగళూరు: సొంతగడ్డపై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్‌ను ఘన విజయంతో ప్రారంభించింది. శనివారం జరిగిన టోర్నీ ఆరంభ పోరులో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు 6 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిత్తుచేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది.**





ఇషాన్ కిషన్ (38 బంతుల్లో 80; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో విజృంభించగా... అనికేత్ వర్మ (18 బంతుల్లో 43; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. క్లాసెన్ (31; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వా లేదనిపించగా... హెడ్ (11), అభిషేక్ శర్మ (7), నితీశ్ కుమార్ రెడ్డి (1), సలిల్ అరోరా (9), హర్ష్ దూబే (3) విఫలమయ్యారు.
బెంగళూరు బౌలర్లలో జేకబ్ డఫీ, రొమారియో షెఫర్డ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో బెంగళూరు 15.4 ఓవర్లలో 4 వికెట్లకు 203 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (38 బంతుల్లో 69 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), దేవదత్ పడిక్కల్ (26 బంతుల్లో 61; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధశతకాలతో అదరగొట్టగా.. కెప్టెన్ రజత్ పాటీదార్ (12 బంతుల్లో 31; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు దంచికొట్టాడు.

### ఇషాన్ కెప్టెన్ ఇన్నింగ్స్

జాకబ్ డఫీ ధాటికి సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టిన సమయంలో ఇషాన్ చక్కటి ఇన్నింగ్స్‌తో అలరించాడు. కమిన్స్ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో అనూహ్యంగా జట్టు పగ్గాలు అందుకున్న ఇషాన్... బౌలర్లపై ఎదురుదాడికి దిగి ఫలితం రాబట్టాడు. అభినందన్ వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్‌లో ఇషాన్ వరుసగా 6, 4, 6 కొట్టి మైదానంలో జోష్ నింపాడు. కాసేపటికి క్లాసెన్ కూడా రెండు ఫోర్లతో సత్తాచాటాడు.
సుయాశ్ శర్మ ఓవర్‌లో మూడు ఫోర్లు కొట్టిన ఇషాన్ 27 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. కృనాల్ వేసిన 13వ ఓవర్‌లో ఈ ఇద్దరు కలిసి మూడు సిక్స్‌లు బాదారు. నాలుగో వికెట్‌కు 97 పరుగులు జోడించిన అనంతరం క్లాసెన్ వివాదాస్పద క్యాచ్ అవుట్‌గా పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత హైదరాబాద్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ఒక ఎండ్‌లో వికెట్లు పడుతున్నా... అనికేత్ దూకుడు కొనసాగించడంతో సన్‌రైజర్స్ మెరుగైన స్కోరు చేయగలిగింది.

### ఆడుతూ పాడుతూ...

దూకుడుకు మారుపేరైన ప్రత్యర్థి ఓ మాదిరి స్కోరుకే పరిమితం చేసిన బెంగళూరు... సొంతగడ్డపై దుమ్మురేపింది. సాల్ట్ (8) రెండో ఓవర్‌లోనే అవుటైనా... ఆ తర్వాత రైజర్స్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా బెంగళూరు దంచికొట్టింది. మంచి ఫామ్‌లో ఉన్న పడిక్కల్ అలవోకగా భారీ షాట్‌లు ఆడుతూ లక్ష్యాన్ని కరిగించాడు. సిక్స్‌తో ఖాతా తెరిచిన అతడు... నితీశ్ రెడ్డి ఓవర్‌లో రెండు ఫోర్లు, పైన్ ఓవర్‌లో 6, 4, 6 బాదాడు. కోహ్లి కూడా 6, 4తో జోరు పెంచడంతో పవర్‌ప్లే ముగిసే సరికి బెంగళూరు 76/1తో నిలిచింది.
దూబే బౌలింగ్‌లో 4, 6 కొట్టిన అనంతరం పడిక్కల్ అవుటయ్యాడు. దీంతో 101 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కెప్టెన్ రజత్ పాటీదార్ ఉన్నంతసేపు భారీ షాట్‌లతో చెలరేగడంతో... స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. బెంగళూరు విజయానికి 48 బంతుల్లో 40 పరుగుల అవసరమైన దశలో... వరుస బంతుల్లో పాటీదార్, జితేశ్ శర్మ (0) అవుటైనా... టిమ్ డేవిడ్ (10 బంతుల్లో 16 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి కోహ్లి మిగిలిన పని పూర్తి చేశాడు.

### సాల్ట్ 'వివాదాస్పద' క్యాచ్

ఈ మ్యాచ్‌లో బెంగళూరు ప్లేయర్ సాల్ట్ తన అసాధారణ ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నాడు. మూడో ఓవర్‌లో హెడ్ కొట్టిన బంతిని బౌండరీ సమీపంలో సునాయాసంగా పట్టిన సాల్ట్... క్లాసెన్ క్యాచ్‌ను బౌండరీ వద్ద అనూహ్య రీతిలో అందుకున్నాడు. షెఫర్డ్ వేసిన ఇన్నింగ్స్ 14వ ఓవర్ తొలి బంతికి క్లాసెన్ డీప్ మిడ్‌వికెట్ దిశగా భారీ షాట్ ఆడగా... అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న సాల్ట్ దాన్ని అందుకున్నాడు. ఈ క్రమంలో అతడు బౌండరీ రోప్ మీద పడ్డట్లు కనిపించింది. పలుమార్లు పరిశీలించిన థర్డ్ అంపైర్ క్లాసెన్‌ను అవుట్‌గా ప్రకటించాడు. దీంతో క్లాసెన్ అసంతృప్తిగా మైదానాన్ని వీడాడు. థర్డ్ అంపైర్ మరో కోణం నుంచి పరిశీలించకుండానే నిర్ణయం ప్రకటించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. అయితే ఆ తర్వాత ఎలాంటి వివాదం లేకుండా 16వ ఓవర్ చివరి బంతికి ఇషాన్ కొట్టిన భారీ షాట్‌ను సైతం సాల్ట్ రెప్పపాటులో అందుకున్నాడు. డీప్ బ్యాక్‌వర్డ్ పాయింట్ బౌండరీ వద్ద కుడివైపు నుంచి పరిగెత్తుకుంటూ వచ్చి ఒంటి చేత్తో బంతిని ఒడిసి పట్టాడు. సూపర్ క్యాచ్‌లతో ఆకట్టుకున్న సాల్ట్... క్లాసెన్ పట్టిన అలాంటి క్యాచ్‌కే పెవిలియన్ చేరడం కొసమెరుపు.

### హడలెత్తించిన డఫీ

న్యూజిలాండ్ పేసర్ జేకబ్ డఫీ ఇప్పటికే జాతీయ జట్టు తరపున 48 టి20లు ఆడి 62 వికెట్లు తీశాడు. అయితే ఇప్పుడు తొలిసారి అతను ఐపీఎల్‌లో అడుగు పెట్టాడు. హేజల్‌వుడ్‌కు ప్రత్యామ్నాయంగా ఆర్‌సీబీ అతడిని తీసుకోగా, తన ఎంపికకు పూర్తి న్యాయం చేస్తూ సత్తా చాటాడు.
తన రెండో ఓవర్లోనే కీలక బ్యాటర్లు అభిషేక్, హెడ్‌లను వెనక్కి పంపిన అతను తర్వాతి ఓవర్లో నితీశ్‌ను అవుట్ చేసి పవర్‌ప్లేలోనే 3/17తో రైజర్స్ పని పట్టాడు. కేవలం 530 మంది జనాభా ఉండే ఎలాంటి సౌకర్యాలు లేని చిన్న ఊరిలో పుట్టిన డఫీ ప్రస్థానం కివీస్ క్రికెట్ వర్గాల్లో ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

### మరో ఇద్దరు...

ఈ మ్యాచ్‌తో మరో ఇద్దరు భారత క్రికెటర్లు ఐపీఎల్‌లో అరంగేట్రం చేశారు. పేస్ బౌలర్ అభినందన్ సింగ్‌కు ఆర్‌సీబీ అవకాశమిచ్చింది. యూపీ టి20 లీగ్‌లో లక్నో ఫాల్కన్స్ తరపున ఆడిన అతనికి సీనియర్ స్థాయిలో ఇదే తొలి అధికారిక టోర్నీ. గత సీజన్‌లోనూ ఆర్‌సీబీతోనే ఉన్నా మ్యాచ్ ఆడే చాన్స్ రాలేదు.
సన్‌రైజర్స్ తరపున ఆడిన సలీల్ అరోరాకు కూడా ఇదే తొలి మ్యాచ్. పంజాబ్‌కు చెందిన 23 ఏళ్ల సలీల్ ముస్తాక్ అలీ టోర్నీలో ఎనిమిది మ్యాచ్‌లలో దాదాపు 200 స్ట్రయిక్ రేట్‌తో 358 పరుగులు చేశాడు. టోర్నీలో ఏకంగా 28 సిక్సర్లతో అదరగొట్టి ఐపీఎల్ చాన్స్ దక్కించుకున్నాడు.

### స్కోరు వివరాలు

**సన్‌రైజర్స్ హైదరాబాద్:**
హెడ్ (సి) సాల్ట్ (బి) డఫీ 11; అభిషేక్ (సి) జితేశ్ (బి) డఫీ 7; ఇషాన్ (సి) సాల్ట్ (బి) అభినందన్ 80; నితీశ్ రెడ్డి (సి) అభినందన్ (బి) డఫీ 1; క్లాసెన్ (సి) సాల్ట్ (బి) షెఫర్డ్ 31; సలిల్ అరోరా (సి) పడిక్కల్ (బి) సుయాశ్ 9; అనికేత్ వర్మ (సి) కోహ్లి (బి) షెఫర్డ్ 43; హర్ష్ దూబే (సి) పడిక్కల్ (బి) షెఫర్డ్ 3; హర్షల్ (సి) పడిక్కల్ (బి) భువనేశ్వర్ 0; డేవిడ్ పైన్ (నాటౌట్) 6; ఉనాద్కట్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 201. వికెట్ల పతనం: 1-18, 2-23, 3-29, 4-126, 5-137, 6-155, 7-167, 8-174, 9-192. బౌలింగ్: డఫీ 4-0-22-3; భువనేశ్వర్ 4-0-31-1; అభినందన్ 3-0-38-1; షెఫర్డ్ 4-0-54-3; సుయాశ్ 3-0-28-1; కృనాల్ 2-0-26-0.

**రాయల్ చాలెంజర్స్ బెంగళూరు:**
సాల్ట్ (సి) క్లాసెన్ (బి) ఉనాద్కట్ 8; కోహ్లి (నాటౌట్) 69; పడిక్కల్ (సి) క్లాసెన్ (బి) హర్ష్ 61; పాటీదార్ (సి) హర్ష్ (బి) పైన్ 31; జితేశ్ (సి) ఉనాద్కట్ (బి) పైన్ 0; టిమ్ డేవిడ్ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు 18; మొత్తం (15.4 ఓవర్లలో 4 వికెట్లకు) 203. వికెట్ల పతనం: 1-9, 2-110, 3-163, 4-163. బౌలింగ్: నితీశ్ రెడ్డి 2-0-19-0; ఉనాద్కట్ 3-0-29-1; డేవిడ్ పైన్ 3-0-35-2; హర్ష్ దూబే 3-0-35-1; ఇషాన్ మలింగ 2-0-35-0; హర్షల్ 2.4-0-39-0.

ఐపీఎల్‌లో నేడు

### ముంబై X కోల్‌కతా

**వేదిక: ముంబై**
**రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం**

## ధోని లేకుండా 2 వారాలు

**దిల్లీ: ఐపీఎల్ ఆరంభం నుంచి క్రికెట్ అభిమానులను అలరిస్తున్న సూపర్ స్టార్లలో మహేంద్రసింగ్ ధోని ఒకడు. కొన్నేళ్లుగా తన రిటైర్మెంట్ గురించి వార్తలు వస్తున్నప్పటికీ.. ఒక్కో సీజన్ పొడిగించుకుంటూ లీగ్‌లో సాగిపోతున్నాడు మహి. అయితే ఈసారి ధోని లేకుండానే ఐపీఎల్‌ను మొదలుపెట్టబోతోంది చెన్నై సూపర్‌కింగ్స్. ఈ దిగ్గజ ఆటగాడు పిక్క గాయంతో ఈ సీజన్లో తొలి రెండు వారాలు జట్టుకు అందుబాటులో లేకుండా పోయాడు. "ధోని పిక్క గాయం నుంచి కోలుకునే ప్రక్రియలో ఉన్నాడు. ఫలితంగా ఐపీఎల్ 2026 సీజన్‌కు తొలి రెండు వారాలు దూరమయ్యే అవకాశముంది" అని సీఎస్కే ఓ ప్రకటనలో పేర్కొంది. 44 ఏళ్ల ధోని గత కొన్ని సీజన్ల నుంచి ఫిట్‌నెస్, ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్నాడు. 2023లో అతడి మోకాలికి శస్త్ర చికిత్స కూడా జరిగింది. నిరుడు ధోని బ్యాటింగ్ ఆర్డర్లో కింది వరుసలో ఆడాడు. ఈ సీజన్ తర్వాత అతను లీగ్‌లో కొనసాగకపోవచ్చనే చర్చ జరుగుతోంది.**





## గాయం వల్లే నేను..

దిల్లీ: దిల్లీ క్యాపిటల్స్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఐపీఎల్ కోసం ఇంకా భారత్‌కు రాలేదు. ఆ జట్టు ఆడే మొదటి కొన్ని మ్యాచ్‌లకు అతడు దూరం కానున్నాడు. ఈ నేపథ్యంలో స్టార్క్ గైర్హాజరీపై అభిమానుల్లో చర్చ మొదలైంది. కొందరు దిల్లీ పట్ల అతడి అంకితభావాన్ని ప్రశ్నించారు. దీంతో స్టార్క్ స్పందించాడు. విమర్శకులపై మండిపడ్డాడు. గాయం వల్లే సమయానికి దిల్లీ జట్టులో చేరలేకపోతున్నానని స్పష్టం చేశాడు. ''భారత్‌లో కొందరు నాపై సోషల్ మీడియాలో కొన్ని వ్యాఖ్యలు చేశారు. కానీ నేను ఇప్పుడు భుజం, మోచేయి గాయాల నుంచి కోలుకుంటున్నా. ఇన్ని రోజులు నాకు దాని తీవ్రత తెలియలేదు. నేను ఐపీఎల్‌లో ఆడడం గురించి కొందరు వ్యక్తులు కఠినంగా మాట్లాడారు. వాళ్లు తప్పుడు సమాచారంతో ఆటగాళ్ల గురించి అభిప్రాయాలు ఏర్పరుచుకుని, వాటినే నిజాలుగా చెబుతున్నారు'' అని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో స్టార్క్ పేర్కొన్నాడు. ఈ ఏడాది ఐపీఎల్ ఆరంభంలో అందుబాటులో ఉండలేక పోతున్నందుకు అభిమానులకు అతడు క్షమాపణలు చెప్పాడు

## తొక్కిసలాట మృతులకు సంతాపంగా..

**ఆనవాయితీకి భిన్నంగా ఈసారి ఎలాంటి ఆరంభ వేడుకలు లేకుండానే ఐపీఎల్ ప్రారంభమైంది. గతేడాది బెంగళూరు జట్టు తొలిసారి ట్రోఫీ చేజిక్కించుకున్న అనంతరం విజయోత్సవంలో తొక్కిసలాట జరిగి 11 మంది అభిమానులు మృతిచెందారు. దీంతో వారిని స్మరిస్తూ... మ్యాచ్ ఆరంభానికి ముందు ఇరు జట్ల ప్లేయర్లు, మ్యాచ్ సిబ్బందితో పాటు ప్రేక్షకులు ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. అలాగే వారి జ్ఞాపకార్థం పీ1 స్టాండ్‌లోని 11 సీట్లను ఖాళీగా పెట్టారు.**

